
వార్త
ఆదివారం
11 మే, 2025
'సరస్వతీ'
సాక్షాత్కారం

**తారాతీరం**

# పూర్వాజ్ దర్శకత్వం 'కిల్లర్'



డిఫరెంట్ సినిమాలతో మూవీ లవర్స్ దృష్టిని ఆకట్టుకుంటున్న దర్శకుడు పూర్వాజ్ "కిల్లర్" అనే సెన్సేషనల్ సైఫై యాక్షన్ థ్రిల్లర్ మూవీని రూపొందిస్తున్నారు. ఈ చిత్రంలో ఆయన హీరోగా నటిస్తుండటం విశేషం. జ్యోతి పూర్వాజ్ హీరోయిన్‌గా నటిస్తుండగా, విశాల్ రాజ్, దశరథ, చందూ, గౌతమ్ ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఏయు అండ్‌ఐ, మెర్జ్ ఎక్స్ ఆర్ సంస్థతో కలిసి థింక్ సినిమా బ్యానర్‌పై ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. పూర్వాజ్ ప్రజయ్ కామత్, ఎ.పద్మనాభరెడ్డి ఈ కొలాబ్రేషన్‌లో నిర్మాణమవుతున్న రెండవ చిత్రమిది.

"కిల్లర్" గ్లింప్స్ తెలుగుతో పాటు కన్నడ భాషల్లో రిలీజ్ చేశారు. మైథాలజీ, సైన్స్ ఫిక్షన్, సూపర్ హీరో..ఇలాంటి ఎలిమెంట్స్‌తో గ్లింప్స్ ఆద్యంతం ఆసక్తికరంగా సాగింది. "కిల్లర్" మూవీ గ్లింప్స్ ఎలా ఉందో చూస్తే ప్రాచీన వైమానిక శాస్త్రంలో ఆశ్చర్యపరిచే మానవ మేథస్సు రహస్యాలు వెల్లడించారు. ఆత్మ కలిగిన యంత్రాలు చూస్తారంటూ వైమానిక శాస్త్రంలో చెప్పిందే నిజం కాబోతోందా అంటూ ఈ గ్లింప్స్ ప్రారంభమైంది. డి బౌండ్ అనే డిజార్డర్‌తో బాధపడుతున్న హీరోయిన్ రాయ్, పూర్తిగా కోలుకుంటే పునర్జన్మ ఎత్తినట్లే అని, అప్పుడు ఆమెకు ఎదురు నిలవడం ఎవరి వల్లా కాదని గ్లింప్స్‌లో చూపించారు. సూపర్ షీ క్యారెక్టర్ లో జ్యోతి రాయ్ చేసిన స్టన్నింగ్ యాక్షన్, సెటిల్డ్ పర్ ఫార్మెన్స్ హైలైట్ గా నిలుస్తోంది. లవ్, రొమాన్స్, రివేంజ్, ఆర్టిఫిషల్ ఇంటెలిజెన్స్, థ్రిల్లర్ అంశాలతో ఈ సినిమా రూపొందించినట్లు గ్లింప్స్‌తో తెలుస్తోంది. మొదలెడదామా అంటూ గ్లింప్స్ చివరలో హీరో, డైరెక్టర్ పూర్వాజ్ పవర్ ఫుల్ డైలాగ్‌తో ఆకట్టుకున్నారు. హై క్వాలిటీ మేకింగ్, వీఎఫ్ఎక్స్ గ్లింప్స్‌కు ఆకర్షణగా నిలుస్తున్నాయి. ప్రస్తుతం చిత్రీకరణ తుది దశకు చేరుకుంటున్న "కిల్లర్" సినిమా త్వరలోనే ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధమవుతోంది.

# ఆమిర్‌ఖాన్, జెనీలియా జోడీగా మరో మూవీ

బాలీవుడ్ కథానాయకుడు ఆమిర్ ఖాన్, జెనీలియా ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'సితారే జమీన్ పర్'. స్పోర్ట్స్ డ్రామా నేపథ్యంలో ఆర్.ఎస్ ప్రసన్న తెరకెక్కిస్తున్నారు. ఆమిర్‌ఖాన్ ప్రొడక్షన్స్ సంస్థ నిర్మిస్తోంది. తాజాగా ఈ సినిమా జూన్20న విడుదల కానుందని ప్రకటిస్తూ సామాజిక మాధ్యమాల వేదికగా ఫస్ట్ లుక్‌ను పంచుకుంది చిత్రబృందం. 'ప్రేమ, నవ్వు, ఆనందాలను చేసుకునే చిత్రం' అనే వ్యాఖ్యను జోడించింది. గతంలో విడుదలై విమర్శకుల ప్రశంసలు దక్కించుకున్న 'తారే జమీన్ పర్'కు సీక్వెల్‌గా రూపొందుతున్న చిత్రమిది. మానసికంగా సవాళ్లు ఎదుర్కొంటున్న ఓ వ్యక్తి మంచిగా ఎలా మారుతాడు అనేకథాంశం చుట్టూ తిరుగుతోన్న చిత్రమిది. ఈ సినిమాలో బాస్కెట్ బాల్ కోచ్‌గా కనిపించి సినీ ప్రియులను ఆకట్టుకోనున్నారు ఆమిర్. ఇందులో దర్శీల్ సఫారీ కీలక పాత్ర పోషిస్తున్నారు.



## మంచి ముత్యాలు

'మంచితనం' 'సంపద' లాంటిది. కొన్నిసార్లు మితంగా..
అవసరమైతే అమితంగా.
'సంతోషం' అనేది సంతృప్తిని సంపూర్ణంగా ఇస్తుంది.
సంతోషం సగం బలం కొందరికి.. సంపూర్ణబలం మరికొందరికి.

## కదంబం

'సంఘీ'భావం....5
ఉగ్రవాదుల కంటే ప్రమాదం

కవర్ స్టోరీ..6
'సరస్వతీ' సాక్షాత్కారం

సాహిత్యం.. 11
తెలుగుకు దూరం అవుతున్న బాల్యం

ఈ వారం కవిత్వం...12
ప్రకృతి

నాట్య శాస్త్రానికి యునెస్కో నీరాజనం.. 18

కథ..20
రాజుగారి తోట

భగవంతుని ప్రతిరూపం.... 22

అతి ప్రాచీన శివలింగం... 28

ఇంకా...
మొగ్గ
వారఫలం
వంటలు
వగైరా.. వగైరా..

# సమాచారం

## రక్తం ఇచ్చేవారికీ మంచిదే



అవసరంలో ఉన్నవారికి రక్తదానం చేస్తే వాళ్ల ప్రాణాలు నిలబడతాయి. అయితే, రక్తం తీసుకున్నవారికే కాదు.. ఇచ్చిన వాళ్లకీ మేలే జరుగుతుందనీ ముఖ్యంగా కేన్సర్, గుండె జబ్బుల నుంచి రక్షణ లభిస్తుందనీ లండన్‌లోని ఫ్రాన్సిస్ క్రిక్ యూనివర్సిటీ పరిశోధనలు చెబుతున్నాయి. అరవై యేళ్లలోపు ఉండి వందసార్లు రక్తం దానం చేసిన వాళ్లనీ, నలభై యేళ్లలోపు ఉండి ఐదారుసార్లు రక్తం దానం చేసిన వాళ్లనీ కలిపి శాస్త్రవేత్తలు కొన్ని పరిశోధనలు చేశారు. సాధారణంగా మన రక్తకణాల్లో వయసు పెరిగేకొద్దీ కొన్ని జన్యుపరమైన మార్పులు (మ్యుటేషన్లు) జరుగుతూ ఉంటాయి. ఆ మ్యుటేషన్ల కారణంగానే లుకేమియా వంటి బ్లడ్ కేన్సర్లు వస్తుంటాయి. శాస్త్రవేత్తలు పరిశోధించిన రెండు గ్రూపుల్లోనూ మ్యుటేషన్లు ఒకేలా ఉన్నా.. ఎక్కువ సార్లు రక్తదానం చేసినవాళ్లలో.. పోయిన రక్తకణాల స్థానంలో తరచూ సరికొత్త ఆరోగ్యవంతమైన రక్తకణాలు రావడం, వాటిల్లో కేన్సర్ కణాల ఉనికి లేకపోవడం శాస్త్రవేత్తలు గమనించారు. అలాగే ఈ కొత్త రక్తకణాల వల్ల రక్తం చిక్కబడకుండా కూడా ఉంటోందట. దాంతో గుండెజబ్బులూ, డయాబెటిస్ వంటివి కూడా తగ్గే అవకాశం ఉందని ఈ పరిశోధన తేల్చింది. అందుకే వీలు కుదిరినప్పుడల్లా రక్తదానం చేయడానికే ప్రయత్నించాలంటున్నారు.



### మ్యాజిక్ పాత్ర

ఐస్‌క్రీమ్ ఎక్కువసేపు కరగకుండా ఉంటే బాగుంటుంది. సూప్ వేడివేడిగా పొగలు కక్కుతూ ఉంటేనే రుచి.. సలాడ్ వీలైనంతసేపు తాజాగా కనిపించాలి. ఇలా పదార్థాన్ని బట్టి చల్లగా లేదా వేడిగా అదే సమయంలో తాజాగా ఉండాలని కోరుకునే ఫుడీలకోసమే డబుల్‌వాల్ స్టీల్ డిప్ చిల్లర్ బౌల్ వచ్చింది. స్టీలు పాత్రలా కనిపించే దీనిపైన.. బౌల్ రెండు పొరల మధ్య నీళ్లు పోసేందుకు వీలుగా రంధ్రాలు ఉంటాయి. ఐస్‌క్రీమ్ లేదా డెజర్ట్ లాంటిది ఉంచాలనుకున్నప్పుడు ముందుగా ఈ రంధ్రాలలోంచి నీరు నింపి పాత్రను కాసేపు ఫ్రిజ్‌లో పెట్టి తీస్తే సరిపోతుంది. అదే సూప్ కోసం వాడాలనుకుంటే వేడివేడి నీళ్లుపోసి, ఆ తరువాత సూప్ వేసుకోవాలి. పదార్థాలను ఎక్కువ సేపు చల్లగా లేదా వేడిగా ఉంచే ఈ పాత్రను చిన్న చిన్న వేడుకలకు ఉపయోగించుకోవచ్చు.

మీ రచనల్ని ఈ మెయిల్ చిరునామాకు పంపగలరు.
sunmagvaartha@gmail.com





# వెదురు అందాలు !



వంటింటికైనా, భోజనాల బల్లకైనా అందాన్ని తీసుకొచ్చేవి ట్రేలు, పళ్లాలే కదా! అవి స్టీల్, గాజుతో కాకుండా పర్యావరణానికి మేలు చేసే వెదురుతో చేస్తే ఎలా ఉంటాయి? ఇదిగో ఇలా ముచ్చటగా ఉంటాయి.














## 'సంఘీ' భావం



# ఉగ్రవాదుల కంటే ప్రమాదం

పాకిస్థాన్‌పై పోరుకు యుద్ధమేఘాలు అలముకుని ఉన్న తరుణంలో భారతదేశంలో పౌరులంతా ఏకతాటిపైకి రావాల్సిన అవసరం ఉంది. ఉగ్రవాదుల చర్యల వల్ల మన దేశం ఎంతో నష్టపోతోంది. ఈ విషయంలో కఠినంగా వ్యవహరించక తప్పని పరిస్థితి నెలకొంది. కాశ్మీర్‌లోని పెహల్గామ్‌లో ఉగ్రవాద దాడి తరువాత ప్రపంచదేశాలు భారత ఎలా స్పంధిస్తుందని ఎదురు చూస్తున్నాయి. గతంతో పోలిస్తే ప్రస్తుతం మన దేశం ప్రపంచంలో ఒక స్థాయికి చేరుకుంది. ఒకప్పుడు అంతగా పట్టించుకోని అగ్రదేశాలు ప్రస్తుతం భారత్‌తో చెలిమిని కోరుకుంటున్నాయి. భారత్ ఆర్థికంగా ఎదగడంతో పాటు ఆయుధసంపత్తిని సమకూర్చుకోవడంలో కూడా అగ్రగామిగా ఉంది. ఉగ్రవాదానికి దూరంగా అభివృద్ధి వైపు పయనిస్తున్న భారత్‌కు పొరుగున ఉన్న పాకిస్థాన్‌తో సమస్యలు ఎదురౌతున్నాయి. అనేక సార్లు భారత్‌తో తలపడి పరాజయం చవిచూసినా పాకిస్థాన్ అవకాశం చూసి దొంగడెబ్బతీయడానికి ప్రయత్నాలు చేస్తూనే ఉంది. సరిహద్దులు దాటి మన దేశంలోకి వచ్చి అలజడులు సృష్టించాలని ప్రయత్నాలు చేస్తోంది. 1971 యుద్ధం తరువాత కార్గిల్, పుల్వామా దాడుల సమయంలో భారత్ సమర్థవంతంగా వ్యవహరించి సత్తా చాటింది. అయినప్పటికీ పాకిస్థాన్ ఇంకా భారత్ కవ్వించే చర్యలకు పాల్పడుతోంది. ఒకప్పుడు పాకిస్థాన్‌కు అండగా ఉన్న దేశాలు ప్రస్తుతం ఆ దేశంలోనిఉగ్రవాదానికి వ్యతిరేకంగా ప్రకటనలు చేస్తున్నాయి. పెహల్గామ్ దాడి తరువాత గట్టి దెబ్బ తీయాలని భారత్ వ్యూహం పన్నుతోంది. ఈ విషయంలో ప్రధానమంత్రి నరేంద్రమోడి తీసుకుంటున్న నిర్ణయాలకు దాదాపు అన్ని రాజకీయ పార్టీలు మద్దతు ప్రకటిస్తున్నాయి. పుల్వామా దాడి తరువాత సర్జికల్ స్రయిక్ దెబ్బకు పాకిస్థాన్ గజగజ వణికింది. ప్రస్తుతం తిరిగి భారత్‌తో కయ్యానికి దిగుతోంది. ఈ తరుణంలో భారతదేశంలోని పౌరులంతా ఒక తాటిపైకి రావాల్సిన అవసరం ఉంది. అంతర్గత రాజకీయాలు. వర్గ, మత పోరు ఉన్నప్పటికీ శత్రుదేశం దాడికి వచ్చిన సమయంలో సమర్థవంతంగా ఎదుర్కొవానికి అంతర్గత మద్దతు కూడా ఎంతో అవసరం. కార్గిల్ సమయంతో పోలిస్తే ప్రస్తుతం సోషల్ మీడియా ప్రభావం ఎక్కువగా ఉంది. కొందరు వ్యక్తులు ఈ సోషల్ మీడియా ద్వారా పరాయి దేశానికి మద్దతుగా కొన్ని పోస్టింగ్‌లు చేయడం ఆందోళన కలిగిస్తుంది. కేవలం రెండు తెలుగు రాష్ట్రాల్లోనే సుమారు 55 మందిని పోలీసులు గుర్తించి వారిని అదుపులో తీసుకున్నారు. కొందరిని అరెస్ట్ చేయగా మరికొందరికి కౌన్సెలింగ్ ఇచ్చి పంపిస్తున్నారు. అయితే కొందరు మేధావులు సైతం భారత్‌కు వ్యతిరేకంగా వ్యవహరించడం ఆందోళన కలిగిస్తుంది. కొందరు సెక్యులర్ ముసుగులో పాకిస్థాన్‌కు మద్దతుగా ప్రకటనలు చేస్తున్నారు. దీనివల్ల అంతర్ఘత వివాదాలు చెలరేగే పరిస్థితి ఉంటుంది. వాస్తవానికి పాకిస్థాన్ నుంచి ఉగ్రమూకలు వచ్చి పెహల్గామ్‌లో దాడులు జరిపినప్పుడు అక్కడ స్థానికంగా ఉన్న కొందరు ముస్లిమ్‌లు అందించిన చేయూతకు బాధితులు చేతులెత్తి నమస్కరిస్తున్నారు. హిందువులను గుర్తించి మరీ కాల్పులు జరపడం ద్వారా దేశంలో రెండు మతాల మధ్య చిచ్చు పెట్టడానికి ఉగ్రవాదులు. వీరి వెనుక ఉన్న పాకిస్థానీ ప్రభుత్వం కుట్రలు పన్నింది. అయితే అందుకు భిన్నమైన వాతావరణం భారత దేశంలో నెలకొంది. కాల్పులు జరుగుతున్నప్పుడు స్థానికంగా ఉన్న కొందరు ముస్లింలు హిందువులను కాపాడి సురక్షిత ప్రాంతాలకు తరలించారు. అనంతరం భయాందోళనల్లో ఉన్న పర్యాటకులకు ముస్లింలు ధైర్యాన్ని నూరిపోసారు. అక్కడ ఉన్న క్యాబ్ డ్రైవర్లు పర్యాటకులకు వారి హోటల్స్‌కు, అక్కడి నుంచి ఎయిర్‌పోర్టుకు తీసుకువెళ్లడానికి ఎలాంటి డబ్బు వసూలు చేయలేదు. రెండు రోజుల పాటు ఉచితంగా క్యాబ్‌లు అందుబాటులోకి తీసుకువచ్చారు. పర్యాటకులు కొందరు తమ స్వగ్రామాలకు వచ్చిన తరువాత ముస్లింలు తమకు ఇచ్చిన సహకారాన్ని వెల్లడించారు. రెండు మతాల మధ్య స్నేహపూరిత వాతావరణం నెలకొని ఉంది. అయితే పాకిస్థాన్ ఈ బంధాన్ని తుంచి అల్లర్లు సృష్టించాలని ఎత్తుగడలు వేస్తోంది. ప్రపంచ దేశాలకు భిన్నంగా  అనేక మతాలు, కులాలతో వైవిధ్య వాతావరణం కలిగిన భారతదేశం ప్రస్తుతం కూడా ఇలాంటి ఘటన జరిగిన తరువాత కూడా తామంతా ఐక్యంగా ఉంటూ ప్రపంచ దేశాలకు ఒక సందేశాన్ని ఇస్తోంది. అయితే కొందరు వ్యక్తులు, కుహానా సెక్యులర్లు పెహల్గామ్ ఘటనను స్వప్రయోజనాలకు వాడుకోవాలని కుట్రలు పన్నుతున్నారు. తెలివైన శత్రువు కంటే తెలివితక్కువ స్నేహితుడి వల్లే ఎక్కువ నష్టం కలుగుతుందన్న సామెత ఉంది. ప్రస్తుతం ఈ సామెత కొందరు కుహానా సెక్యులర్లకు సరిగ్గా సరిపోతుంది. శత్రువు కంటే మన మధ్యలో తిరుగుతూ పరాయి దేశానికి మద్దతుగా వ్యవహరించే వారి వల్లే ఎక్కువ నష్టం కలుగుతుంది. ఇలాంటి వారిని గుర్తించి వారి వల్ల దేశానికి ముప్పు కలగకుండా ఉండేందుకు ప్రతి భారతీయుడు అప్రమత్తంగా ఉండాలి. పాకిస్థాన్‌కు అనుకూలంగా పోస్టింగ్‌లు చేసేవారిని, భారతదేశాన్ని చులకన చేస్తూ వ్యవహరించే వారి గురించి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పాటు తగిన బుద్ధి చెప్పడానికి ప్రతి భారతీయుడు సిద్ధంగా ఉండాల్సిన తరుణం ఆసన్నమైంది.

– డాక్టర్ గిరీష్‌కుమార్ సంఘీ

సరస్వతీ నదీ పుష్కరాల విశిష్టత భారతీయ సంస్కృతిలో పుష్కరాలకు ఒక విశిష్ట స్థానం ఉంది. పుష్కరం అంటే జల స్వరూపం. జలాది దేవతగా సమస్త తీర్థములకు నెలవై ఉండి తీర్థరాజు అను పేరుతో లోక కళ్యాణ కారకుడైనట్లు శాస్త్రములు తెలుపుతున్నాయి.



# 'సరస్వతీ' సాక్షాత్కారం

కవర్ స్టోరీ

రామకిష్టయ్య సంగనభట్ల

ఇలా ప్రతి 12 సంవత్సరాలకు ఒకసారి పుష్కరాలు కలుగుతాయి. ఈ కాలంలో స్నానం, తర్పణం, జపం, దానం తదితర పుణ్యకార్యాలు చేయడం వలన అనేకమైన పాపాలు నశిస్తాయని భక్తులు విశ్వసిస్తారు. ప్రతి పన్నెండేళ్ల కోసారి వచ్చే ఈ పర్వదినాన పవిత్ర నదుల్లో స్నానం చేయడం ఆచారంగా వస్తోంది. ఇది కేవలం శరీర శుద్ధికే కాకుండా, పాప ప్రక్షాళనకు, పితృదేవతల ఆశీస్సులకు, అంతిమంగా మోక్షానికి మార్గం సుగమం చేస్తుందని భక్తులు విశ్వసిస్తారు. ఈ సంవత్సరం మిథున రాశిలో బృహస్పతి ప్రవేశంతో ప్రారంభం కానున్న సరస్వతీ నదీ పుష్కరాలు దేశవ్యాప్తంగా ఒక పండుగ వాతావరణాన్ని నెలకొల్పనున్నాయి.

## పుష్కరాల శాస్త్రీయ పునాది

పూర్వం ధర్మాత్ముడైన తుందిలుడు తపస్సు చేసి ఈశ్వరుని మెప్పించి, ఆయన అష్టమూర్తులలో జలమూర్తిగా శాశ్వత స్థానం పొందాడు. అప్పటినుండి అతడు పుష్కరుడుగా మూడున్నర కోట్ల పుణ్యతీర్థాలకు అధిపతి అయ్యాడు.

సృష్టి కార్యం కోసం బ్రహ్మదేవుడు ఈశ్వరుని ప్రార్థించి పుష్కరుడిని తన కమండలంలోకి తెచ్చుకున్నాడు. తరువాత, ప్రాణుల జీవనాధారం కోసం బృహస్పతి బ్రహ్మను కోరగా, పుష్కరుడు బ్రహ్మను వీడనన్నాడు. చివరికి బృహస్పతి మేషం నుండి మీనం వరకు ఒక్కో రాశిలో ప్రవేశించినప్పుడు మొదటి పన్నెండు రోజులు, అలాగే ఏడాది పొడవునా మధ్యాహ్నం రెండు ముహూర్తాల సమయం పుష్కరుడు బృహస్పతితో కలిసి ఉంటాడు. ఈ పుష్కర కాలంలో నదీ స్నానం చేయడం పుణ్యప్రదం అని పురాణాలు చెబుతున్నాయి.

**దీనిని ఆధారంగా తీసుకొని–**

"మేషే గంగా వృషే రేవా మిథునేతు సరస్వతీ కర్కటే యమునా ప్రోక్తా సింహే గోదావరీ స్మృతా కన్యాయాం
కృష్ణవేణీచ కావేరీ ధటకే స్మృతా వృశ్చికే తామ్రపర్ణీచ చాపే పుష్కర వాహినీ మకరే తుంగభద్రాచ కుంభే సింధు
నదీ స్మృతా మీనే ప్రణీతా నదీచ గురోస్సంక్రమణే స్మృతా పుష్కరాఖ్యౌ మునీనాంహి బుధై స్మృతా....."

దేవ గురువగు బృహస్పతి మేష రాశిలో ఉన్నప్పుడు గంగానదికి, వృషభ రాశిలో ఉన్నప్పుడు నర్మదా నదికి, మిథున రాశిలో ఉన్నప్పుడు సరస్వతీ నదికి, కర్కాటక రాశిలో ఉన్నప్పుడు యమునా నదికి, సింహరాశిలో ఉన్నప్పుడు గోదావరి నదికి, కన్యారాశిలో ఉన్నప్పుడు కృష్ణా నదికి, తులారాశిలో ఉన్నప్పుడు కావేరి నదికి, వృశ్చిక రాశిలో ఉన్నప్పుడు తామ్రపర్ణి నదికి, ధనూరాశిలో ఉన్నప్పుడు బ్రహ్మపుత్రకు, మకర రాశిలో ఉన్నప్పుడు తుంగభద్రా నదికి, కుంభ రాశిలో ఉన్నప్పుడు సింధు నదికి, మీన రాశిలో ఉన్నప్పుడు ప్రణీతా నదికి, పుష్కరాలు చెప్పబడ్డాయి.

## వేదాల్లో సరస్వతీ నది – జ్ఞాన ప్రవాహం

వేదాల్లో సరస్వతీ నదిని అత్యంత పవిత్రంగా భావిస్తారు. ఋగ్వేదం ఆమెను "అమ్బీతమే, నదీతమే, దేవితమే" అంటూ స్తుతిస్తుంది.

అంటే తల్లులలోకెల్లా గొప్ప తల్లి, నదులలోకెల్లా పవిత్రమైనది, దేవతలలోకెల్లా శ్రేష్ఠమైనది అని అర్థం. సరస్వతీ కేవలం ఒక భౌతికమైన నది మాత్రమే కాదు, ఆమె జ్ఞానానికి, వివేకానికి ప్రతీక. వ్యాసుడు, ఇతర కవులు, తాత్వికులు సరస్వతి దేవిని జ్ఞాన ప్రవాహంగా, పరమాత్మ స్వరూపిణిగా అభివర్ణించారు. ఆమె విద్యాధిదేవత, సంగీతానికి అధిపతి, వాక్కును ప్రసాదించే శక్తిగా పూజలందుకుంటుంది. పుష్కరాల సమయంలో సరస్వతీని స్మరించడం అంటే మనస్సును నిర్మలంగా ఉంచుకోవడం, జ్ఞానాన్ని పొందడానికి ఒక అడుగు ముందుకు వేయడమే.

ఋగ్వేదంలో సరస్వతీ పేరు 50 సార్లకు పైగా ప్రస్తావించ బడింది. ఆ నదిని యమునా, శతద్రు నదుల మధ్య ప్రవహించే జీవనదిగా వర్ణించారు. అది కేవలం నీటి ప్రవాహం కాదు. అది వాక్కు, జ్ఞానం, పూజా విధానాలకి మూలం. కాలక్రమేణ అది వాక్దేవిగా మారిపోయింది.



పశ్చిమాన, పరియాత్రా, వింధ్య పర్వతాలకు ఉత్తరాన, హిమాలయాల దక్షిణాన ఉన్నట్లు ప్రస్తావిస్తు న్నాయి. పతంజలి మహాభాష్యం కూడా ఆర్యావర్తాన్ని వశిష్ఠుని ధర్మ సూత్రాల్లానే వర్ణించింది. బౌద్ధయానా ధర్మసూత్రాలు ఆర్యావర్తం అంటే కలకవానాకు పశ్చిమాన, సరస్వతీ నది అదృశ్యమైన ఎడారి అయిన ఆదర్శనకి తూర్పున, హిమాలయాలకు దక్షిణాన, వింధ్యకు ఉత్తరాన ఉన్న భూమి అని ప్రకటించారు. నదితో కాక భాషతో అనుసంధానిస్తూంటాయి. మైఖేల్ విజెల్ కూడా ఋగ్వేదంలో సరస్వతి అప్పటికే దాని ప్రధాన నీటి వనరును కోల్పోయి, చేరుకోవాల్సి న తుది సరస్సు (సముద్రం)లో ముగిసి పోతుందని ప్రస్తావించాయని పేర్కొన్నాడు.


## పురాణాలలో సరస్వతి

పలు పురాణాలు సరస్వతి నదిని వర్ణించాయి, 'పంచలింగ బ్రాహ్మణం' ప్రకారం సరస్వతి నది మహాప్రబలమైన నది. సింధు నాగరికతలకు అదే ప్రామాణికం. ఈ నది ఆరు నుంచి ఎనిమిది కిలోమీటర్ల వెడల్పుతో స్థిరమైనదిగా ఉండి, ఒక్కోచోట పదునాలుగు కిలోమీటర్ల వెడల్పుతో విలసిల్లిన నది. విస్తృత భూగర్భాన్వేషణలను బట్టి సరస్వతీ నది పెక్కు సార్లు తన ప్రవాహ దిశను మార్చుకుంటూ, క్రీ.పూ.1900 ప్రాంతంలో పూర్తిగా ఎండిపోయినట్లు కనుగొన్నారు. మహాభారత యుద్ధం కాలం నాటికీ శుషించిపోయి ఎడారిలో కలిసిపోయినట్లు పౌరాణికుల అంచనా. అంతకుముందు సరస్వతి సింధుల డెల్టాలతో ఆనాటి పశ్చిమ భారతం కళకళలాడుతూ సిందుగా ప్రవహించేది. అందుకే భారతీయ మంత్రాలలో గంగేచ యమునే చైవ గోదావరీ సరస్వతీ నర్మదే సింధు కావేరీ జలేస్మిన్ సన్నిధిం కురు.. అని చదువుకుంటుంటాం. తాము అభిషేకించే జలంలోకి ఆయా పవిత్ర నదీ జలాలను ఆవాహన చేసుకోవడం, సంప్రదాయంగా తీసుకున్నాయి. రుగ్వేదం సరస్వతీ నదిన పవిత్రమాతగా స్తుతిస్తోంది. ఈ నది సరస్సు లు (సారాస్) గా విభజింప బడిందనీ స్పష్టంగా నమోదు చేశారు. స్కంద పురాణం ప్రకారం సరస్వతి బ్రహ్మ నీటి కుండ నుండి ఉద్భవించి, హిమాలయాలపై వున్న పిప్పల వృక్షం మీద నుంచి ప్రవహిస్తుంది. ఇది కేదారం వద్ద పశ్చిమ దిశకు తిరిగి, అంతర్వాహినిగా భూగర్భంలో ప్రవహిస్తుంది. ఇందులోనే సరస్వతీ నది ఐదు శాఖలను పేర్కొన్నారు. ఈ పాఠ్యం సరస్వతిని బ్రహ్మ భార్య బ్రాహ్మిగా చిత్రీకరించింది. వామన పురాణం ప్రకారం, సరస్వతి నది పిప్పల వృక్షం నుంచి పెరిగింది.

స్మృతులలో పేర్కొన్న అంశాలు మను స్మృతి ప్రకారం, వరదల నుండి తప్పించు కున్న సాధువు మనువు సరస్వతి, దృషద్వతి నదుల మధ్య వేద సంస్కృతిని స్థాపించాడు. ఈ సరస్వతి నది బ్రహ్మవర్తానికి పశ్చిమ సరిహద్దుగా ఉందనీ, "సరస్వతి, దృషద్వతి మధ్య ఉన్న భూమి దేవుని సృష్టి అయిన బ్రహ్మవర్తం" అనీ మను స్మృతిలో పేర్కొన్నారు. వశిష్ఠుని ధర్మ సూత్రాల్లోని శ్లోకాలు ఆర్యావర్తాన్ని సరస్వతీ నది ఎడారిలో అదృశ్యమైన ప్రాంతానికి తూర్పున, కలకవానాకు

## పరిశోధనకు ఆధారాలు

హిందువులు సరస్వతీ నదిని అంతర్వాహినిగానూ, గంగా యమునల సంగమంలో త్రివేణి సంగమం వద్ద ప్రవహిస్తోందనీ భావిస్తారు. స్వర్గం వద్ద ఉండే క్షీరవాహిని, వైదిక సరస్వతీ నది ఒకటేనని, మరణానంతరం అమరత్వానికి ఇది మార్గంగా భావించేవారనీ హార్వర్డ్ విశ్వవిద్యాలయంలో సంస్కృత ఆచార్యుడు, హార్వర్డ్ ఒరియంటల్ సీరీస్‌కి సంపాదకుడు అయిన మైఖేల్ విజెల్ భావించాడు. ఋగ్వేదంలోనూ, తర్వాతి వేదాల్లోనూ ప్రస్తుత కాలంనాటి నదులు, ప్రాచీన నదులను స్తుతించడం కనిపిస్తుంది. ఋగ్వేదంలోని నదీస్తుతి మంత్ర భాగం సరస్వతీ నదిని తూర్పున యమున, పశ్చిమాన సట్లెజ్ (శతధృ) నడుమ ఉన్నట్టు వర్ణించింది. తర్వాతి వేద పాఠ్యాలైన తాంద్య, జైమినీయ బ్రాహ్మణాలు, మహాభారతం సరస్వతీ నది ఎడారిలో ఇంకిపోయినట్టు ప్రస్తావించాయి. 19వ శతాబ్ది తుదికాలం నుంచి పరిశోధకులు వైదిక సరస్వతీ నది ఇప్పటి వాయవ్య భారత దేశంలోనూ, తూర్పు పాకిస్తాన్‌లోనూ ప్రవహిస్తున్న ఘగ్గర్‌హక్రా నదీ వ్యవస్థలోనిదని భావించ



సాగారు. శాటిలైట్ తీసిన చిత్రాలు సరస్వతీ నదీ గమనాన్ని మరింత స్పష్టంగా చూపించాయి, ఆ నది ఇప్పటి ఘగ్గర్ నదీ గమనాన్ని అనుసరించేది. సింధులోయ నాగరికత విలసిల్లిన రాజస్థాన్‌లోని కాలిబంగన్, హర్యానాలోని బనవాలీ, రాఖీఘరి,



గుజరాత్‌లోని ధోలవిరా, లోథాల్ ఈ నదీపరీ వాహక ప్రాంతంలోనే ఉన్నట్టుగా పరిశోధకులు గుర్తించారు. ఐతే, ఘగ్గర్ హక్రా ఋగ్వేదంలో ప్రత్యేకించి ప్రస్తావింపబడి వుండడం, అదీ వేదకాలానికి ఎండిపోయిన నదిగా దాని ప్రస్తావన రావడంతో వైదిక సరస్వతీ నదిని ఘగ్గర్ హక్రా నదీ వ్యవస్థలో గుర్తించడం సమస్యాత్మకమైనది. అన్నెట్ విల్కె మాటల్లో వైదిక ప్రజలు వాయవ్య భారతదేశంలోకి వలస వస్తున్న కాలానికి ఘగ్గర్‌హక్రా, ఎడారిలో చిన్న ప్రవాహం అయిపోయింది. ఇటీవలి భూభౌతికశాస్త్ర పరిశోధనలు ఘగ్గర్ హక్రా నదీ వ్యవస్థ, వర్షాకాలంలో వర్షపునీటితో నిండే నదుల వ్యవస్థ అనీ, వాతావరణ మార్పుల వల్ల నదులు ఇంకిపోతూం డడంతో సింధులోయ నాగరికత దెబ్బతిని పోయి వుండవచ్చనీ సూచిస్తున్నాయి. 4 వేల యేళ్ళ క్రితం ఆ నాగరికత అంతమవు తూన్నప్పుడే ఈ నదులకు నీటినిచ్చే వర్షరుతువు దెబ్బతినడం మొదలైంది. దక్షిణ ఆఫ్ఘనిస్తాన్‌లోని హెల్మండ్ లేదా హరాక్షవతి నది అయి వుండవచ్చని కూడా భావిస్తున్నారు. వైదిక జాతి తర్వాత పంజాబ్‌కు చేరినప్పుడు హరాక్షనదికి వాడిన సంస్కృత పదాన్నే ఘగ్గర్‌హక్రా నదికి కూడా వాడారని అంచనా. వేస్తున్నారు. ఋగ్వేదపు సరస్వతీ నది అన్నది రెండు వేర్వేరు నదులను సూచిస్తోందనీ, ఒక గ్రంథం హెల్మండ్ నదినీ, మరోటి ఘగ్గర్‌హక్రానీ సూచిస్తూండ వచ్చన్నారు. కొందరు ఋగ్వేదాన్ని మరింత ప్రాచీనమైనదిగా చెప్తూ, సింధునదీ నాగరికతను "సరస్వతీ సంస్కృతి", "సరస్వతీ నాగరికత", "సింధు సరస్వతీ నాగరికత", "ఇండస్ సరస్వతీ నాగరికత"గా పేర్లు మారుస్తూండడంతో, 21వ శతాబ్దిలో ఘగ్గర్‌హక్రా నదీ వ్యవస్థతో గుర్తించడం కొత్త ప్రాధాన్యత సంతరించుకుంది. సింధు సరస్వతీ నాగరికతగా ఈ నాగరికతకు పేరు మారుస్తున్న పరిశోధకులు, సింధు లోయ నాగరికత, వైదిక సంస్కృతీ ఒకటేనంటూ ఆర్య దండయాత్ర సిద్ధాంతం లేదా ఆర్యుల వలస సిద్ధాంతాన్ని తిరస్కరిస్తున్నారు. హిందూత్వంలో సరస్వతీ నదికి పూజార్హత, ప్రాముఖ్యత ఉంది. వైదిక సంస్కృతం, ఋగ్వేదం తొలిభాగం, పలు ఉపనిషత్తులు వంటి ముఖ్య మైన వైదిక సాహిత్యం వంటి వాటికి జన్మస్థానమైన బ్రహ్మావర్తం అనే వైదిక ప్రాంతం సరస్వతీ నది, దాని ఉపనది దృషద్వతిల ఒడ్డున ఉండేదని చెప్తారు. మనుస్మృతిలో, స్వచ్ఛమైన వైదిక సంస్కృతికి బ్రహ్మావర్తం కేంద్రం అని పేర్కొని వుంది. ద రైజ్ ఆఫ్ సివిలైజేషన్ ఇన్ ఇండియా అండ్ పాకిస్తాన్ అన్న గ్రంథంలో బ్రిడ్జెట్, రేమండ్ అల్చిన్ "ఋగ్వేద కాలంనాడు భారత, పాకిస్తాన్‌లలో మొట్టమొదటి ఆర్యభూమి పంజాబ్‌లో సరస్వతీ, దృషద్వతీ నదుల లోయల్లో ఉండేదన్న" భావన వెల్లడించారు.

2015లో వేదనది భౌతిక ఉనికి ఋజువయ్యాక, సరస్వతి నది ఉనికిని బలపరుస్తోందంటూ రాయిటర్స్ నివేదిక పేర్కొంది. ఈ నేపథ్యంలో భారతీయ జనతా పార్టీ నేతృత్వంలోని ప్రభుత్వం పురావస్తు శాస్త్రవేత్తలను పురాతన సరస్వతీ నది ఆనవాళ్లను అన్వేషించమని ఆదేశించింది.

## సరస్వతీ నది - విశేషాలు

వేదాల్లో అత్యంత పవిత్రమైన నదిగా గుర్తింపు.

**జ్ఞాన ప్రదాత:** విద్యా, సంగీత, వాక్కులకు అధిదేవత.

**మోక్షదాయకం:** పుష్కర స్నానం పాపాలను పోగొట్టి మోక్షాన్ని ప్రసాదిస్తుందని విశ్వాసం.

**పుష్కర సంబరాలు: పవిత్ర స్థలాల సమాగమం**

సరస్వతీ పుష్కరాల సందర్భంగా భక్తులు ముఖ్యంగా మూడు పవిత్ర ప్రదేశాలలో అధిక సంఖ్యలో పాల్గొంటారు. **మానా గ్రామం (బద్రీనాథ్ సమీపంలో, ఉత్తరాఖండ్):** ఇది సరస్వతీ నది ప్రారంభమయ్యే ప్రదేశంగా భావిస్తారు.



ఇక్కడ నది ఒక వేద స్వరూపంగా ఉద్భవిస్తుంది. ఈ ప్రదేశంలో సరస్వతీ నది స్వచ్ఛమైన, తొలి ప్రవాహాన్ని దర్శించడం ఒక ప్రత్యేక అనుభూతి.

## త్రివేణి సంగమం (ప్రయాగ్ రాజ్, ఉత్తర ప్రదేశ్)

గంగా, యమునా నదులతో పాటు అంతర్వాహినిగా సరస్వతీ నది ఇక్కడ కలుస్తుంది. ఈ సంగమ స్థానం స్నానానికి, పితృ కార్యాలైన పిండ ప్రదానం, తర్పణాలు చేయడానికి అత్యంత పవిత్రమైనదిగా భావిస్తారు. లక్షలాది మంది భక్తులు ఈ సమయంలో ఇక్కడకు తరలివస్తారు.

## కాళేశ్వరం (తెలంగాణ)

దక్షిణ భారతదేశంలో ముఖ్యమైన పుణ్యక్షేత్రం. ఇక్కడ గోదావరి, ప్రాణహిత నదులతో పాటు సరస్వతీ నది కూడా అంతర్లీనంగా కలుస్తుందని నమ్ముతారు.

ఈ క్షేత్రంలో పుష్కరాల కోసం ప్రత్యేక ఘాట్‌లు, మండపాలు, భక్తుల సౌకర్యార్థం శాశ్వతమైన ఏర్పాట్లు చేస్తున్నారు. తెలంగాణ ప్రభుత్వం ఈ పుష్కరాలను ఘనంగా నిర్వహించడానికి సన్నాహాలు చేస్తోంది.

## సాంఘిక, ఆధ్యాత్మిక దృష్టి కోణం

పుష్కరాలు కేవలం ఆధ్యాత్మిక వేడుకలుగా మాత్రమే కాక, సమాజాన్ని ఏకతాటిపైకి తీసుకొచ్చే సంస్కృతిక పండుగలుగా అభివృద్ధి చెందాయి. వివిధ ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు ఒకే తీరంలో స్నానాలు చేయడం, భోజనాలు పంచుకోవడం, ధర్మబోధనలు వినడం... ఇవన్నీ సామాజిక సామరస్యతకు ప్రతీకలుగా నిలుస్తున్నాయి. ఈ పర్వదినాల్లో తర్పణాలు, దానాలు, వేదపారాయణాలు వంటి ఆచారాలు ధార్మికతను గాఢం చేస్తాయి. సరస్వతీ పుష్కరాలు విశిష్టత మరింతగా విద్య, జ్ఞానం పట్ల ఉన్న అంకిత భావంతో కనిపిస్తుంది. విద్యార్థులు, గురువులు, అధ్యయనార్థులు ఈ సందర్భంగా జ్ఞానోదయానికి శ్రీకారం చుట్టేలా చూస్తారు.

ఈ పుష్కరాలు గ్రామీణ, పట్టణ జన జీవితానికి ఒక ఊతంగా మారుతాయి. పుష్కర ఘాట్ల వద్ద ఉపాధి అవకాశాలు, చిన్న పరిశ్రమలు, స్థానిక కళలు–వాణిజ్యాలు మెరుస్తుంటాయి. ప్రభుత్వం చేపట్టే పునాది మౌలిక వసతుల నిర్మాణం, ప్రజారోగ్య శిబిరాలు వంటి కార్యక్రమాలు భవిష్యత్తు అభివృద్ధికి బాటలు వేస్తాయి.

అంతేగాక, పుష్కరాల సందర్భం తరుణంగా మనలో సాంప్రదాయాల పట్ల గౌరవం, సంస్కృతిపట్ల ఆరాధన, ప్రకృతితో సౌహార్దం పట్ల అవగాహన పెరుగుతుంది. సరస్వతీ దేవిని జ్ఞాన తల్లి గానే కాక, నదీ తల్లి, సంస్కృతి తల్లి, జీవన



తల్లి అన్న నాలుగు ప్రమేయాలలో పరిగణించడం ఈ పుష్కరాల విశిష్టతను చాటుతోంది. పుష్కరాలు కేవలం మతపరమైన ఉత్సవాలు కాక, సామాజిక, ఆధ్యాత్మిక మార్గదర్శకాలు. ఆధ్యాత్మికం, ధ్యానం, జపం, సాధనకు పునాది. సరస్వతీ పుష్కరాలు భారతీయ జ్ఞాన సాంప్రదాయానికి ప్రతీక. ఇది విద్యార్థులకు ప్రేరణ, గురుకులాలకు శక్తి, భక్తులకు ముక్తిమార్గం. 2025 సరస్వతీ పుష్కరాలు సమాజాన్ని ఒక ఆధ్యాత్మిక ఉద్యమంగా మలచనున్నాయి. ఈ పుణ్య క్షణాలు మనం తరతరాలుగా నెరపవలసిన సంస్కృతి ప్రస్థానా నికి మార్గదర్శకాలు.

## సరస్వతీ బోధన: మనలో మార్పు రావాలి

ఈ పుష్కరాల ముఖ్య సందేశం... మనిషి కేవలం బాహ్యంగానే కాకుండా అంతర్గతంగా కూడా శుద్ధి చెందాలి. సరస్వతీ దేవి వేదాల్లోని రూపం, తత్వశాస్త్రం భావం, పురాణ కథ... వీటన్నింటినీ మనం అర్థం చేసుకోవాలి. ఆమెను కేవలం ఒక నదిగా కాకుండా, జ్ఞాన ప్రవాహంగా, ఆత్మజ్యోతిగా, ధార్మికమైన వెలుగుగా గుర్తించాలి.

పుష్కరాలు రావడం అంటే ఆ జ్ఞాన ప్రవాహానికి మన మనస్సును తడపడం. ఆ ప్రవాహంతో కలిసి మనలోని మలినాలు, అజ్ఞానం కొట్టుకుపోవాలి. అప్పుడే మనకు నిజమైన ముక్తి లభిస్తుంది. సరస్వతీ నది మనలోని లోపాలను మాయం చేసే శక్తిని కలిగి ఉంది. ఆమె జ్ఞాన జల ప్రవాహం మన పాపాలను శాశ్వతంగా తొలగించగలదు. ఈ పవిత్ర సమయంలో సరస్వతీ మాతను స్మరిస్తూ, జ్ఞాన మార్గంలో పయనిద్దాం!



# ఇంటికే ఆపరేషన్ థియేటర్



**ఆ**రోగ్య శిబిరాల పేరుతో వైద్యులు మారుమూల గ్రామాల్లోని రోగులకు సాధారణ పరీక్షలు మూడు పరీక్షలు చేసి మందులివ్వడం మనకు తెలుసు. ఆపరేషన్ల కోసమైతే కచ్చితంగా ఆసుపత్రికే వెళ్లాలి. కొన్ని రోజులు అక్కడే ఉండాలి. కానీ ఎలాంటి సర్జరీ అయినా హాస్పిటల్‌కి వెళ్లకుండా ఉన్నచోటే చేయించుకునే వీలుంటే.. ఎంత బాగుంటుందో కదూ. సరిగ్గా ఇలానే ఆలోచించారు డాక్టర్ సుధీర్ శ్రీవాస్తవ. సకల సౌకర్యాలతో ఓ బస్సునే ఆపరేషన్ థియేటర్ మార్చి భారత్‌లోని మారుమూల పల్లెలకు సైతం వెళ్లేలా దాన్ని సిద్ధం చేశారు. జైపూర్‌కు చెందిన శంకర్‌లాల్కి గుండె సమస్య. అత్యవసరంగా చికిత్స చేయాలి.

ఆరోగ్యం క్షీణించి కదల్లేని స్థితిలో ఉన్న అతని ఇంటికే... ఈమధ్య నిపుణుల బృందంతో ఆపరేషన్ థియేటర్ వెళ్లి. వాళ్ల గుమ్మంలోనే గుండె ఆపరేషన్ మూడొందల దూరంలో ఉన్న వైద్యులు. అదెలగంటారా... డాక్టర్లు ఓ ఆసుపత్రిలో ఉండి సుదూరంలో ఉన్న మరో హాస్పిటల్‌కి సర్జరీ చేయడం విదేశాల్లో మామూలై పోయింది. భారత్‌లో కూడా కొన్ని చోట్ల ఉన్నారు. అసలు ఆసుపత్రికే వెళ్లాల్సిన పనిలేకుండా రోగి ఇంటికే ఆపరేషన్ రోగిని తీసుకెళ్లడమే ఈ బస్సు ప్రత్యేకత! టెలి సర్జన్ పేరు పొందిన సుధీర్ అద్భుత ఆవిష్కరణ ఇది.

**ఆ మరణం కదిలించింది...**

రాజస్థాన్‌లోని జోదుర్కు చెందిన సుధీర్ పేద కుటుంబం తండ్రి చిరుద్యోగి. చిన్నతనంలోనే డాక్టర్ కావాలనే లక్ష్యాన్ని పెట్టుకున్న సుధీర్ చదువులో ఎప్పుడూ ముందుండేవారు. అజ్మేర్ మెడికల్ కాలేజీలో ఎంబిబిఎస్ పూర్తి చేశారు. అమెరికాలో హార్ట్ సర్జన్‌గా పట్టా పొందాక 2003లో అక్కడే సొంతంగా హాస్పిటల్‌ను ఏర్పాటు చేశారు. ఆపరేషన్‌లో కోత, కుట్లు అవసరాన్ని తగ్గించే రోబోటిక్ టెక్నాలజీ నిపుణుడిగా గుర్తింపు సాధించారు. ఈ సాంకేతికత భారత్‌లో కూడా ఉండాలని ఆశపడ్డారు. అలా, ఢిల్లీకి చెందిన ఓ ఆసుపత్రి సుధీర్ సహకారంతో రోబోటిక్ టెక్నాలజీని అందుబాటులోకి తెచ్చింది. రోబోటిక్ సర్జరీ చేస్తే తను తొందరగా కోలుకుంటుందనీ అందుకు అవసరమైన డబ్బు ఏర్పాటు చేసుకోమనీ చెప్పారాయన. ఆర్నెలపాటు ఆమె ఆరోగ్యం గురించి ఫాలోఅప్ చేస్తూనే ఉన్నారు. కానీ సమయానికి డబ్బు అందక ఆమె చనిపోయింది. ఆ మరణం సుధీర్‌ను ఎంతగానో కలచివేసింది. విదేశాల్లోని రోబోటిక్ యాంత్రాల ధర దాదాపు రూ.20 కోట్లు కావడం వల్లే ఆపరేషన్లకు ఎక్కువ ఖర్చవుతోందనీ, అలా రోబోలను భారత్‌లో చౌకగా అందించాలనీ అమెరికా నుంచి శాశ్వతంగా ఢిల్లీకి వచ్చారు. 2014లో 'ఎస్ఎస్ ఇన్నొవేషన్స్' పేరుతో గుడ్‌గావ్‌లో సమస్థను ఏర్పాటు చేసి న్యూరాలజీ, యూరాలజీ, గైనిక్ తదితర సమస్యలకు సర్జరీ చేసే రోబోట్లను "ఎస్ఎస్ మంత్ర" పేరుతో తయారు చేయడం మీద దృష్టిపెట్టారు. ఇల్లూ, కారూ, ఫర్నిచర్ సహా అన్నీ అమ్మేసి రూ.40 కోట్లు ఖర్చుపెట్టారు. విదేశాల నుంచి రూ.30 కోట్ల పెట్టుబడి సాధించి... తొలిసారి దేశీయ సాంకేతికతతో కూడిన రోబోటిక్ సర్జరీ యంత్రాలని ఆవిష్కరించారు. ఎంతో మందికి ఉచితంగా ఆపరేషన్లు చేసి సత్ఫలితాలను సాధించారు. దీనికి 'సెంట్రల్ డ్రగ్స్ స్టాండర్డ్స్ కంట్రోల్ ఆర్గనైజేషన్' అనుమతి కూడా లభించింది. మనదేశంలో ఏ శస్త్రచికిత్స అయినా ముప్పై నుంచి యాభై వేల లోపు పూర్తి కావాలనే సంకల్పంతో ఆ రోబోలను రూ.3 కోట్లకే అమ్మసాగారు. ఇండియాలో వంద హాస్పిటళ్లలో వీటిని ఏర్పాటు చేశారు. దుబాయ్, ఆస్ట్రేలియా, అమెరికా తదితర దేశాలకూ వాటిని పంపారు.

**బస్సులో ఆపరేషన్.....** అనుకున్నది సాధించిన సుధీర్ అక్కడితో ఆగకుండా దూర ప్రాంతంలో ఈ ఆపరేషన్లు చేసేలా టెలిసర్జరీ వ్యవస్థను రూపొందించారు. ప్రభుత్వాసుపత్రితో సేవలను పొందుతున్న హాస్పిటళ్లలోని వ్యక్తులలో ఒకరికి గాల్‌బ్లాడర్ని, ఇద్దరికి మూత్రాశయాన్ని, మరో ఇద్దరికి గర్భాశయాన్ని తొలగించారు. ఈ విధంగా ఓ పదిమందికి ఆపరేషన్లు చేసి విజయం సాధించిన సుధీర్ పల్లెలకీ ఈ సౌకర్యం అందించాలను కున్నారు. రోబోటిక్ యంత్రాలు, అత్యాధునిక ల్యాబ్ సౌకర్యాలతో ఆపరేషన్ థియేటర్‌ను ఏర్పాటు చేశారు. కేంద్ర ప్రభుత్వానికి చెందిన 'అపెక్స్ రెగ్యు డ్రగ్స్ అండ్ మెడికల్ డివైజెస్' సంస్థ టెలిసర్జరీ బస్సుకు అనుమతి ఇవ్వడంతో ఇద్దరు విద్యార్థుల వద్దకు వెళ్లింది. మొబైల్ ఆపరేషన్ థియేటర్‌లో ఉన్న సాయంతో ఇళ్ల వద్ద ఉన్న రోగులకు గుడ్‌గావ్ నుంచే సుధీర్ ఆపరేషన్ నిర్వహించే విధానంలో ఇరవై నాలుగు గంటల్లోనే రోగులు కోలుకుంటారు. విశ్రాంతి వెసులుబాటు ఉంది కాబట్టి వైద్య బృందం కూడా అక్కడే ఉంటారు. రోగి బాగోగులు చూసుకుని క్షేమంగా కుటుంబ సభ్యులకు అప్పగించాకే అక్కడి నుంచి వెళ్లిపోతారు. హాస్పిటళ్ల చుట్టూ తిరిగితేగానీ ఆపరేషన్లు చేయించుకోలేని పరిస్థితుల్లో పేషెంట్లు ఇల్లు కదలకుండా సేవలందిస్తున్న సుధీర్ సాంకేతిక కృషి వైద్య చరిత్రలో సంచలనమనే చెప్పాలి. ■



# తెలుగుకు దూరం అవుతున్న బాల్యం




జయసూర్య

మహాకవి గురజాడ అప్పారావు, రచన కన్యాశుల్కం నాటకంలో వెంకమ్మ, గిరీశాన్ని పిలిచి, 'బాబూ మా పిల్లాడూ మీరూ ఇంగ్లీషులో ఒక్కసారి మాట్లాడు కుందురూ' అని బతిమాలు తుంది. గురువు వచ్చీరాని ఆంగ్లంలో, వెంకటేశంతో మాట్లాడేస్తాడు. అది విని వెంకమ్మ ఎంతో ఆనందపడుతుంది. గురజాడ ఆ ముచ్చట సృష్టించి నాటి మధ్య తరగతి కుటుంబాలలో వున్న పరభాషా వ్యామోహాన్ని వెంకమ్మ పాత్ర ద్వారా ప్రదర్శింపచేసారు. శతాబ్దాల కాలం నాటి తెలుగు సమాజంలో, ఆంగ్లం పట్ల ఉన్న మోజు, వ్యామోహం .. కుటుంబం కొంప ఎలా ముంచిందీ, కన్యాశుల్కంలో అద్భుతంగా నాటక ఫక్కీలో సంభాషణలు వ్యక్తం చేస్తాయి. ఆనాటి వెంకమ్మ ముచ్చట తెలుగుజాతి కొంప కొల్లేరు చేసింది. 2012లో మహాకవి గురజాడ స్వర్ణోత్సవ శతాబ్ది ఉత్సవాలు వైభవంగా నిర్వర్తించుకొన్నాం. "డామిట్ కథ అడ్డం తిరిగింది' ప్రస్తుతం డిజిటల్ యుగంలో ప్రవేశించాం 'ఒక్కసారి చక్కటి తెలుగులో మాట్లాడండిరా' అని మాతృభాష ప్రేమికులు పిల్లల్ని బతిమాలుకొనే దుస్థితి సంప్రాప్తించింది. ప్రముఖ తమిళకవి సుబ్రహ్మణ్య భారతి 'వెన్నెల వేళ పడవ ప్రయాణం చేస్తూ, 'సుందర తెలుంగు గీతం' పాడుకుంటూ పరవశిద్దాం– అనే రోజుల నుంచి 'నా అక్షరాలు వెన్నెల్లో ఆడుకొనే అందమైన ఆడపిల్లలు' అని బాలగంగాధర తిలక్ చెప్పిన దశాబ్దాల నుంచి మన ప్రయాణం ఎటుపోతోంది? 'ఒక్క సంగీత మేదో పాడునట్లు, మాట్లాడేటప్పుడు విన్పించే భాష' అన్నారు. కవిసమ్రాట్ విశ్వనాథ. 'ఎంత చక్కని దోయి ఈ తెనుగు తోట ఎంత పరిమళమోయి ఈ తోట పూలు' అనుకొని మురిసిపోయారు కందుకూరి రామభద్రకవి. తెలుగుతోట ఒక సుందర నందనవనం. ఆ సుందర ఉద్యానవనంలోంచి 'మా తెలుగు తల్లికి మల్లెపూదండ' అంటూ మధురగానం పరిమళ మృదు భరితంగా అందించారు శంకరంబాడి సుందరాచారి. తల్లి భాషలో పిల్లలకు చదువు నేర్పించటం, పరాయి భాషలో కంటే ఎక్కువ సత్ఫలితాలు ఇస్తోందని ప్రపంచంలో భాషావేత్తలు, మేధావుల పరిశోధనానుభవాలు స్పష్టం చేస్తున్నాయి. ఇంతవరకు ఇతర రాష్ట్రాలలో, విదేశాలలో జీవనోపాధి నిమిత్తం తరలి వెళ్లిన తెలుగు కుటుంబాలు, శతాబ్దాలనాటి కాలభ్రమణంలో అక్కడక్కడ స్థిరపడిన తెలుగు మూలాలు వున్న ప్రవాస కుటుంబాలలో అనివార్యంగా కొంత తల్లిదండ్రులతో పాటు, పిల్లలు తల్లిభాషకు దూరమయ్యారు. మహానగరాలలో తెలుగు రాయటం, చదవటం మాట దేవుడెరుగు, మాట్లాడడం కూడా రాని పిల్లల సంఖ్య పెరుగుతోంది. కాలం ముందుకు నడిచేకొద్దీ తెలుగు వాళ్లమని చెప్పుకోవటం కూడా పరిస్థితుల ప్రాబల్యం మింగి వేసే, స్థితి గతులు నెలకొంటున్నాయి. వేషం ఎప్పుడో అటకెక్కింది. ఆచార వ్యవహారాలు కూడా పాశ్చాత్య జీవన విధానం కారణంగా ఆధునికత సంతరించుకుంటున్నాయి. నేటి యువతరం రేపటి తల్లిదండ్రులుగా, తెలుగుతనం పూర్తిగా కనుమరుగయ్యే జీవనశైలిని తమకు రాబోయే పిల్లలకు అందించే పరిస్థితులు స్పష్టంగా కనపడుతున్నాయి. కొన్ని కుటుంబాలలో ఆసక్తి వున్నా నిస్సహాయత నడిపిస్తోంది. ఇక తెలుగు పేరిట రాజకీయ పార్టీ, ఆవిర్భవించి నాలుగు దశాబ్దాలైంది. తొలినాళ్లలో ఎన్.టిఆర్, తమిళనాడు అడుగు జాడలలో రాజకీయంగా జాతీయ పార్టీల ఆధిపత్యాన్ని మట్టి కరిపించారు. అధికార భాషగా, జన సామాన్య భాషగా తెలుగు సంస్కృతి, సంప్రదాయాలు, మహనీయుల ఆరాధన బాగానే ప్రారంభమైంది. అధికారభాషా సంఘం, తల ఎత్తింది. "అన్యభాషలు నేర్చి ఆంధ్రమ్ము రాదంచు.. సకిలించు ఆంధ్రుడా చావవెందుకురా..! ' ఏనాడో కాళోజీ హెచ్చరిక, తెలుగు ఎవ్వరిపాలు చేసి తిరిగెదవు ఆంధ్రా' అంటూ వేలూరి శివరామశాస్త్రి వంటి వారి ఆవేదన కాల ప్రవాహంలో కనుమరుగయ్యాయి. తెలుగు అధికార భాషగా పాలనా వ్యవహారాలలో మరింత పూర్తి స్థాయిలో అమలు జరపాలని, తెలుగు మాధ్యమంలో విద్యాబోధన జరగాలని భాషోద్యమకారులు, తల్లి భాష ప్రేమికుల వేదన అరణ్యరోదన అయింది. ఇప్పటికే ఆంధ్రావనిలో పరాయి భాషల ఆధిపత్యం కారణంగా చిక్కిశల్యమవుతున్న మన మాతృభాష కొత్త బెడద ఎదుర్కోవలసి వచ్చింది. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాబోధనకు ఆంగ్ల మాధ్యమానికి ప్రోత్సాహం ప్రభుత్వ సంకట నిర్ణయంగా సంక్రమించింది. 1970 దశకం నుంచి డిగ్రీ స్థాయి వరకు తెలుగు మాధ్యమంలో పాఠ్య గ్రంథాలు రూపొందింపచేసి బోధిస్తున్నారు. సామాజిక శాస్త్రాలకు సంబంధించి పోస్టు గ్రాడ్యుయేట్ స్థాయి పుస్తకాలు తెలుగులో వచ్చాయి. తెలుగు అకాడమీ ఆవిర్భావంతో తెలుగు మాధ్యమం అమలు సాధ్యమవుతోంది. పరిపాలనా సంస్కరణలు మరింత వేగంగా చేపట్టగలిగితే ప్రభుత్వ ఉద్యోగాలు రాష్ట్ర స్థాయిలో పెరిగి నిరుద్యోగ సమస్య పరిష్కరించుకోవచ్చు.

కానీ ఇంగ్లీష్ చదువు లేకుండా యువత, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పొందడం అసాధ్యమనే భావన ప్రస్తుతం సమాజంలో బలపడింది. ప్రపంచం ఒక గ్లోబల్ విలేజ్‌గా రూపు దిద్దికొంటున్న తరుణంలో పోటీ తట్టుకోవాలంటే ఆంగ్ల విద్యా నైపుణ్యం అవసరమని తల్లిదండ్రులు భావిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వాలు కూడా విద్యా రంగంలో నాణ్యత లేని ప్రైవేటే కార్పొరేట్ విద్యను ప్రోత్సహిస్తున్నాయి. డిజిటల్ ఇండియాను తేనే కన్నా మధురమైన మనతల్లి పలుకు తట్టుకోగలదా?

# ఈ వారం కవిత్వం

## ప్రకృతి

సముద్ర తీరంలో సవ్వడితో అలల
సవ్వడి పలకరింపులు విసరగా
పర్వత శిఖరాలు, విచిత్ర వెలుగు
వెదజల్లగా
అడవిలో వన్యప్రాణుల నడకలు
వర్షం చినుకులు చల్లగ కురియగ
చెరువు గట్టు చెట్లపై చిలకల
పలకరింపు వినపించ
సాగునీరు, పంట పొలాలు
ఆ ప్రక్కన
తూర్పు గగనంలో సూర్యోదయం
పగటి వెలుగై తొణకగా,
సంధ్య వింధ్యగిరి విరబూయగా
వెలిగే నక్షత్రాల రాజ్యం చీకటి



పారదోలెనుగా..
ఉదయం
నదుల్లో జల ప్రవాహం
మంచు శిఖరాలు
పచ్చని మైదానాలు
పక్షుల గుంపులు
విరిసే విరుల సువాసన,
ఆశావాదాన్ని వెదజల్లె కిరణాలు,
మేఘాల దాటిన వానలు గలగలా
పక్షుల పరుగు,
పొడవైన కొండలతో
ఆకాశం నీలాంబరం ధరించి,
పచ్చని పొలాలు విస్తరించి
నవ్వులు పూయగా
గులాబీల సుగంధం, తేటగా
సూర్యకాంతి తాకె,
తెరువులపై పూల సువాసనలు
అప్యాయతా సూచకాలు
మందారమాలల
గాలి తీరాల సువాసనలు, కోయిల
కూజతాలు
తేజస్సు వెదజల్లె రవికిరణం,
మొగ్గలు విరిసిన చిగురులు
ప్రకృతి పరిసరాలలో ఆనందం
నిండుగా నిత్యం పరచే సౌందర్యం

**- చిట్యాల రవీందర్**



## అమ్మే ఆమె

ఋతుచక్రం
నాలో ఊపిరి పోసుకున్నది
కాలం అడుగులేసే
సప్తతిలోకి భావోద్వేగాల గిర్రలై

మైదానంలో ఆట
ఎంతో గెలిచింది చాలా ఓడింది
గాయాలను మాన్పేసే
జీవ ఔషధమై బతుకంతా

మనసు గుండెల చెరిగిపోని
మధుర జ్ఞాపకం
కరిగిపోని అద్భుత సాఫల్యం

మనసు పొత్తిళ్ళ అమ్మ
చెమట రక్తం కలిసిన ప్రయోగశాల
మౌనం మాట్లాడే భాషల అంతరంగం
తరంగాల సముద్రంలో
అనితర అనంత కార్యశాల

రంగూ రుచీ వాసన అన్నీ అమ్మవే

ప్రతి ఆమెలో

చూపు ఓర్పు నేర్పు అమ్మరూపమే

ఆమే అమ్మ ఎక్కడైనా

అమ్మే ఆమె ఎప్పుడైనా

ఒప్పుకోని జీవి ఏదైనా ఉందంటే

అది భూమ్మీద పుట్టనిదై ఉంటుంది

**- డా.టి.రాధాకృష్ణమాచార్యులు**

## ఊపిరి దృశ్యం

ఒక అలసిపోయిన గుండె ఆర్తనాదం!
ఓ ఎముకలగూడు మధ్యలో
ఓ సమాధిలో
మారుస్తున్నట్లు కలగంటుంది
శాస్త్రాన్ని విసనకర్రలా..
ఆవరణాన్ని ధ్యాన మందిరంగా
భూమండలాన్ని సమతుల్యంగా
దుప్పటిని అల్లుతూ
పరారుణాల వలువదుల
ప్రభావం తట్టుకుంటూ
నరాల వేర్లై
చూపుల్లోంచి అతినీలలోహిత
అవరోధ పొర ఏర్పడి
మెదళ్లలో పసరు నిండి
శరీరమంతా గడ్డి మొలిచి
ఒకనొక మూత నిండుతుంది
కిష్ట చర్యలు కొనసాగుతూ
ధరణి లోపలా పైనా
భృకుటి ఏమాత్రం చెదరక
మూసే ఉండి నవ్వుతూ
ఆపై కళ్లు తెరుచుకుని
ముక్కుపుటాలకు తగిలి
పగుళ్లలోనో
పలకల మధ్యో
నుజ్జు నుజ్జయి
వెరసి కొంత గుజ్జు
వేడి తేమ చెమ్మ తడి తగులుతూ
వేల సంవత్సరాల ప్రక్రియ
కొనసాగుతూ..
ఒక పసిరిక గీతం పాదుగుతూ ..
మొలకెత్తుతున్న ఊపిరి దృశ్యం.

**- రఘు వగ్గు**

## 'మార్పుల కూర్పు జీవితం'

జీవితం ఓ సుదీర్ఘ ప్రయాణం
ఎన్నెన్నో మలుపులు
సాగిపోతే కొనసాగేది
సంశయిస్తే ఆగిపోయేది!

మార్పుల కూర్పు జీవితం
ప్రతి మార్పు ఒక సవాలు
పోరాడితే కొన్ని గెలుపులు
ఓడితే గెలుపుకు మెట్లు !

ఓర్పు ఓపిక ఉంటే
ఓటమి ఎక్కడిది?

సహనం సాహసముంటే
సాధించనిది ఏది?

ఆవాంతరాలు ఎదురవుతాయి
వాటి ఆవల ఆవకాశాలుంటాయి
నిరాశావాది అతిగా ఆలోచిస్తాడు!
ఆశావాది మళ్లీ మళ్లీ ప్రయత్నిస్తాడు!!

సూర్యుడొస్తేనే ఉదయం..
శ్రమిస్తేనే విజయం

పాడితే సప్త స్వరాలు

పాటుపడితే సమస్త వరాలు !!

**- జగ్గయ్య. జి**

**దోశ పిండి సిద్ధంగా లేదంటే హాఫ్ బాయిల్డ్ ఎగ్‌తోనో, బాంబే టోస్ట్‌తోనో టిఫిన్ ముగించేస్తాం. గుడ్డుతో వంటలూ సులువే, పోషకాలూ ఎక్కువే!**

# గుడ్డు రుచులు

## స్టఫ్డ్ ఎగ్ బాల్స్



**కావలసినవి :** గుడ్లు–4, శనగ పిండి–కప్పు, బియ్యప్పిండి, మొక్కజొన్న పిండి, మిరియాల పొడి–చెంచా చొప్పున, ఉప్పు–కొద్దిగా, కారం–2 చెంచాలు, పసుపు –పావు చెంచా, మిర్చి–3, వెల్లుల్లి రెబ్బలు–4, అల్లం అంగుళం ముక్క, బంగాళ దుంపలు–2, ఉల్లిపాయ–1, బ్రెడ్‌పొడి–అర కప్పు, నూనె–తగినంత. **తయారీ :** గుడ్లను ఉడికించి పక్కనుంచుకోవాలి. బంగాళదుంపలు ఉడికించి, మెత్తగా మెదపాలి. ఒక పాత్రలో శనగపిండి, బియ్యపిండి, మొక్కజొన్న పిండి, కారం, ఉప్పు, పసుపు, మిరియాల పొడి, అల్లం, మిర్చి, వెల్లుల్లి తరుగు, ఉల్లిపాయ ముక్కలు, మెదిపిన బంగాళదుంపలు, బ్రెడ్ పొడి వేసి బాగా కలపాలి. గుడ్డును సగానికి కోసం, ఈ మిశ్రమంలో ముంచి బాల్‌లా చేసి నూనెలో వేయించాలి. అంతే రుచికరమైన 'స్టఫ్డ్ ఎగ్ బాల్స్' సిద్ధం.

## ఎగ్ ఛాట్




**కావల్సినవి :** ఉడికించిన గుడ్లు–నాలుగు, తరిగిన టొమాటోలు– రెండు, ఉల్లిపాయ–ఒకటి (సన్నగా తరగాలి), తరిగిన వెల్లుల్లి–చెంచా, పచ్చి మిరపకాయలు–నాలుగు (సన్నగా తరగాలి), పుదీనా, కొత్తిమీర తరుగు–కొద్దిగా, ఉప్పు–తగినంత, కారం–చెంచా, పసుపు– చిటికెడు, ఛాట్ మసాలా–చెంచా, పోపు దినుసులు–చెంచా, కరివేపాకు–రెండురెమ్మలు, నూనె–మూడు పెద్ద చెంచాలు. **తయారీ :** ఓ గిన్నెలో ఉడికించిన గుడ్లలోని పచ్చ భాగాలను తీసుకుని పొడిలా చేసి పెట్టుకోవాలి. మరో గిన్నెలో తెల్లభాగాన్ని కాస్త పెద్ద ముక్కలుగా కట్ చేసి పెట్టుకోవాలి. పొయ్యి వెలిగించి పాన్ పెట్టుకోవాలి. ఇందులో నూనె వేసి వేడయ్యాక పచ్చిమిర్చి ముక్కలు వేసి వేయించాలి. ఇందులోనే జీలకర్ర, ఆవాలు, కరివేపాకు, టొమాటో ముక్కలు వేసి వేయించాలి. ఇది వేగుతున్నప్పుడే కారం, ఉప్పు, పసుపు, ఛాట్ మసాలా వేసి బాగా కలపాలి. కాసిన్ని నీళ్లు పోసి ఉడికించాలి. నీళ్లన్నీ ఇగిరిపోయాక పుదీనా తురుము వేయాలి. ఇందాక కోసి పెట్టుకున్న పచ్చసొన పొడి, తెల్ల ముక్కలు వేసి కాస్త మగ్గనివ్వాలి. మరికాస్త ఛాట్ మసాలా వేసి కలపాలి. చివరగా పుదీనా, కొత్తిమీరతో గార్నిష్ చేసుకోవాలి.

## క్లాసిక్ ఆమ్లెట్ అండ్ గ్రీన్స్

**కావలసినవి :** గుడ్లు–4, బచ్చలి కూర తరుగు–కప్పు, ఉల్లిపాయ–2, పచ్చిమిర్చి–2, వెల్లుల్లి కాడలు–2, చీజ్–100 గ్రా, నిమ్మరసం–చెంచా, ఆలివ్ నూనె–3 చెంచాలు, ఉప్పు–తగినంత, మిరియా పొడి–చెంచా, వెన్న–2 చెంచాలు.

**తయారీ :** వెల్లుల్లి కాడలను కడిగి సన్నగా తరిగి ఉంచాలి. గుడ్లు పగలకొట్టి.. అందులో ఉప్పు, మిరియాల పొడి, ఉల్లి, పచ్చిమిర్చి ముక్కలు, బచ్చలికూర తరుగు, నిమ్మరసం వేసి బీట్ చేయాలి. నాన్ స్టిక్ ప్యాన్‌లో నూనె వేడయ్యాక.. గుడ్డు మిశ్రమం వేసి సమంగా పరచుకునేట్లు సర్దాలి. మూత పెట్టి నాలుగు నిమిషాలు వదిలేయాలి. మూత తీసి.. చీజ్ తురుము, వెన్న, మిరియాల పొడి వేసి సన్న సెగ మీద ఒక నిమిషం ఉంచి దించేస్తే సరిపోతుంది. రొటీన్‌కు భిన్నమైన క్లాసిక్ ఆమ్లెట్ అండ్ గ్రీన్స్ వహ్వా అనిపిస్తుంది.



## బెల్ పెప్పర్ ఎగ్స్

**కావలసినవి :** ఎరుపు, ఆకుపచ్చ, పసుపుపచ్చ బెల్ పెప్పర్స్–ఒక్కోటీ రెండు చొప్పున, మిరియాల పొడి – టేబుల్ స్పూన్, చీజ్–100 గ్రా, ఉప్పు –తగినంత, ఉల్లి కాడల తరుగు–అర కప్పు, గుడ్లు–6, చిల్లీ ఫ్లేక్స్–చెంచా, సన్న కారప్పూస–రెండు చెంచాలు.

**తయారీ :** బెల్ పెప్పర్స్ సగానికి కోసి, తొడిమలు, గింజలు తీసేయాలి. కొద్దిగా ఉప్పు, మిరియాల పొడి చిలకరించినట్లు వేసి అవెన్‌లో బేక్ చేయాలి. బయటకు తీసి తురిమిన చీజ్, ఉల్లి కాడల తరుగు కొన్ని చిల్లీ ఫ్లేక్స్, కాస్త మిరియాల పొడి, ఉప్పు, గుడ్డు సొన వేసి.. మరోసారి బేక్ చేయాలి. తినేటప్పుడు ఇంకాస్త మిరియాల పొడి, చిల్లీ ఫ్లేక్స్ సన్న కారప్పూస వేస్తే అమోఘంగా ఉంటాయి.



# తెలుగుదనం ఉట్టిపడే బంతిపువ్వు!

బంతిపూవు అన్న మాటలోనే తెలుగుదనం కనిపిస్తుంది. బంతిలో ఎన్నోరకాలు రంగులున్నాయి. ముద్దబంతి, ఊకబంతి, రేకబంతి, కారంబంతి ఇలా ఎన్నో జాతులున్నాయి. అందంగా గుచ్చిన బంతి పూలతోరణం లేనిదే తెలుగువారింట ఏ పండగా పూర్తి కాదు. దేశవ్యాప్తంగా అన్ని వేడుకలకు బంతే అలంకారం. పసుపు, కాషాయ రంగుల్లో ఉండే బంతిపూలదండలు ఇళ్లకు, పెళ్లిమండపాలకు అలంకరిస్తారు. ప్రకాశవంతమైన రంగు ఆకర్షణ త్వరగా వాడకపోవడం తక్కువ ధరకు దొరకడంతో ఇవి ఎక్కువ వాడకంలో ఉన్నాయి. బంతివాసనవల్ల క్రిమికీటకాలు ఇంట్లోకి రావు. గొబ్బెమ్మలు పెట్టి దానిమీద బంతిపెడితే పురుగులురావు. ఇవి పూజకు పనికిరావని అలంకరణకే కొందరు వాడతారు. కానీ పూజల్లోను బంతిపూలు వాడేవాళ్లు ఇప్పుడిప్పుడు పెరుగుతున్నారు. కారంబంతి పూలను చేమంతులతో కలిపి దేవుళ్లకు వేస్తున్నారు. దుర్గాదేవిని పసుపు కాషాయ వర్ణాల బంతులతో పూజిస్తారు. అయ్యప్ప పడిపూజలో బంతిపూలే సోపానాలు.



బంతిపూలు మంచి యాంటీసెప్టిక్ విషకీటకాలు కుట్టినచోట ఈ పూలను రుద్దితే వాపు నొప్పి తగ్గుతాయి. బంతిపూలు లేదా ఆకులను నూరి గాయాలకు పుండ్లకు కట్టుకడితే మంచి ఫలితం ఉంటుంది. దురదలు పొక్కులు వంటి చర్మవ్యాధులు తగ్గించడంతో బాటు వాటి కారణంగా పడే మచ్చల మీద కూడా పూలను రుద్దడం వల్ల ఈ మచ్చలు కూడా త్వరగా మాయమౌతాయి.

బంతిపువ్వులను సాధారణంగా భారతదేశ సాంప్రదాయంలో ఉపయోగిస్తారు. అంతేకాకుండా, బంతిపువ్వుల వలన ఆరోగ్యానికి వివిధ రకాలుగా ప్రయోజనాలున్నాయి. వాటి గురించిన వివరాలు ఇక్కడ విశదీకరించబడినది. ప్రకాశవంతమైన రంగును కలిగి ఉండే బంతిపువ్వు చెట్టు, పువ్వుల గురించి సాధారణంగా అందరికి తెలిసిందే. అంతేకాకుండా, దీని వలన చాలా ఆరోగ్యకర ప్రయోజాలు కూడా ఉన్నాయి. దీని వలన మన ఆరోగ్యానికి కలిగే, మీకు తెలియని ప్రయోజనాల గురించి ఇక్కడ వివరించడం జరిగింది. బంతిపువ్వు గాయాలను త్వరగా తగ్గించే శక్తిని కలిగి ఉంటుంది. బంతిపువ్వు నుండి సేకరించిన ఉత్పత్తులు చిన్న చిన్న గాయాలు, దెబ్బలు, చర్మ చికాకు సమస్యల నుండి త్వరితంగా ఉపశమనాన్ని కలిగిస్తుంది. 'బ్రెజిల్'లో జరిపిన పరిశోధనల ప్రకారం, బంతిపువ్వు నూతన కణాల రక్తనాళాల పెరుగుదలను ప్రోత్సహిస్తుందని కనుగొన్నారు. దీని వలన గాయాలను తగ్గించి, వాటి స్థానంలో నూతన కణాల పెరుగుదలను అధికం చేస్తుంది. బంతిపువ్వులలో ఉండే 'ల్యూటీన్' అనే యాంటీ ఆక్సిడెంట్‌లు రొమ్ము క్యాన్సర్‌ను తగ్గించుటలో శక్తివంతంగా పని చేస్తాయి.

**యామిజాల జగదీశ్**

## ఒక్క రోజు నిద్ర తగ్గినా..

ఒక్కరోజు నిద్రపోకపోతే ఏమవుతుంది?... చాలామంది నిద్రని ఇలాగే తేలిగ్గా తీసుకుంటారు. శారీరక ఆరోగ్యం బాగుండాలంటే చక్కని ఆహార నియమాలు పాటిస్తూ, మంచి వ్యాయామం చేస్తే చాలనుకుంటారు... కానీ వీటితో పాటు మంచి నిద్ర కూడా ముఖ్యమేనంటోంది పరిశోధన. కువైట్‌లోని డాస్‌మేన్ డయాబెటిస్ ఇన్‌స్టిట్యూట్ విశ్రాంతికీ, దీర్ఘకాలిక వ్యాధులకూ ఉండే సంబంధంపైన పరిశోధన చేసింది. మనం నిద్ర పోకుండా ఉన్నప్పుడు మెదడు మనం ఒత్తిడిలో ఉన్నామేమో అనుకుంటుంది. దాన్ని తగ్గించడానికి కార్టిసాల్ అనే హార్మోన్‌ని మామూలు కన్నా ఎక్కువగా విడుదల చేస్తుంది. ఇలా 'ఒక్కరోజే కదా' అని సర్దిచెప్పుకుంటూ మనం పదేపదే నిద్రకు దూరమవుతూ ఉన్నప్పుడు శరీరంలో కార్టిసాల్ ఎక్కువగా జమవుతూ చివరికి శరీరంలో వాపులకు కారణం అవుతుంది. పక్క నిద్రలేమితో మరో శక్తిని కోల్పోయి... ఇన్ఫెక్షన్లతో పోరాడే గుణాన్ని కోల్పోతాయి. దాంతో వ్యాధి నిరోధక శక్తి తగ్గిపోతుంది. ఈ మొత్తం పరిస్థితిని చక్కదిద్దడానికి శరీరం మోనోసైట్స్ అనే వ్యాధి నిరోధకత కనపడకుండా చేస్తుంది. ఈ పరిస్థితి పదే పదే కొనసాగితే శరీరంలో ఇన్‌ఫ్లమేషన్ పెరుగుతూ వచ్చి ఊబకాయం, గుండెజబ్బులతో పాటు దీర్ఘకాలిక సమస్యలు రావొచ్చట. అందుకే పని ఒత్తిడీ, వారంతా పార్టీలు అనే సాకులు చెప్పకుండా తగినంత విశ్రాంతి తీసుకోవాల్సిన అవసరం ఉందంటోంది పరిశోధన.



# శీతల పానీయాలతో జాగ్రత్త

**డాక్టర్ మోటె చిరంజీవి**

పిల్లల నుంచి పెద్దవారి వరకు కూల్ డ్రింక్స్ ఎంతో ఇష్టపడి తాగుతూ ఉంటారు. నిజానికి ప్రతిరోజూ కూల్ డ్రింక్స్ తాగేవారు కూడా ఉంటారు. ఇలా తాగడం వల్ల అనేక అనారోగ్య సమస్యలు వచ్చే అవకాశాలు ఉన్నాయని ఆరోగ్య నిపుణులు తెలుపుతున్నారు. వేసవికాలంలో చల్లదనం కోసం వీటిని మరింతగా తాగుతారు. ఇందులో ఉండే రసాయనాలు ఎముకల సమస్యలతో పాటు ఎన్నో రకాల దీర్ఘకాలిక వ్యాధులకు దారి తీస్తుంది. స్నేహితులతో టైమ్‌పాస్ కోసం, తిన్నది అరిగించు కోవడం కోసం, చాలా మంది కూల్ డ్రింక్స్ తాగుతుంటారు. కొందరికి సందర్భం ఏదైనా చల్లగా ఒక డ్రింక్ కడుపులో పడితే ఆ హాయే వేరు. కానీ, శీతల పానీయమే కదా అని అదే పనిగా తాగితే కొంప మునిగినట్టే. శీతల పానీయాలను ఎక్కువగా తాగడం వల్ల అనేక అనారోగ్య సమస్యలు వస్తాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు. చూడడానికి రకరకాల రంగుల్లో, చల్లగా ఉంటాయి కూల్ డ్రింక్స్. ఇటీవల కాలంలో వీటిని తాగే వారి సంఖ్య విపరీతంగా పెరిగింది. స్నేహితులను కలిసినప్పుడు, రెస్టారెంట్‌కు వెళ్లినప్పుడు ఇలా సందర్భం ఏదైనా కూల్ డ్రింక్స్‌ను తాగుతున్నారు. వేసవి వస్తే ఇంకా ఎక్కువగా శీతల పానీయాలు సేవిస్తున్నారు. కానీ కూల్‌డ్రింక్స్‌ను అదే పనిగా తాగడం వల్ల లేనిపోని రోగాల్ని కొని తెచ్చుకున్నట్లే అని వైద్యులు చెబుతున్నారు. అతిగా కూల్ డ్రింక్స్ తాగడం వల్ల దీర్ఘకాలిక వ్యాధులు వస్తాయని హెచ్చరిస్తున్నారు.

కూల్ డ్రింక్స్ తాగడం వలన పురుషుల కంటే మహిళల్లోనే ఎక్కువ శాతం సైడ్ ఎఫెక్ట్స్ వచ్చే అవకాశాలు ఉన్నాయి. లివర్ కేన్సర్‌తో పాటు ప్రెగ్నెన్సీ, గుండెపోటు లాంటి జబ్బులు వచ్చే అవకాశం ఉంది. ఈ శీతల పానీయాలు తాగడం వలన మహిళల్లో ఫ్లై బ్రోస్, ఫిరోసిస్ వంటి కాలేయంలో మంట వచ్చే అవకాశం ఉంది. ఈ వ్యాధి ప్రమాదానికి దారితీస్తుంది. సాధారణంగా 250-300 మిల్లీ లీటర్ల కూల్‌డ్రింక్‌లో 150-200 క్యాలరీలు ఉంటాయి. కూల్‌డ్రింక్‌లో అధిక ఫ్రక్టోజ్ ఉంటుంది. దీని వల్ల బరువు పెరిగే అవకాశం ఉంది. ఫలితంగా డయాబెటిస్, బిపి, గుండె జబ్బులు వచ్చే అవకాశం ఉంది. రోజూ కూల్ డ్రింక్స్ తాగే వారిలో అందులో ఉన్న ఫాస్ఫరిక్ యాసిడ్ వల్ల జీర్ణ వ్యవస్థ దెబ్బతింటుంది. తిన్న ఆహారం జీర్ణం కావడానికి ఉపయోగపడే కాంపొనెంట్ హైడ్రాలిక్ యాసిడ్ ఉపయోగపడుతుంది. ఇది మన పొట్టలోనే ఉత్పత్తి అవుతుంది.



కూలా డ్రింక్స్ తాగినప్పుడు అందులో ఉండే రసాయనం ఈ యాసిడ్‌తో కలిసినప్పుడు జీవక్రియల మీద విపరీతమైన ప్రభావం పడుతుంది. ప్రజల ఆరోగ్యాన్ని పణంగా పెట్టి కూల్‌డ్రింక్ కంపెనీలు యేటా ఏడు వేల కోట్లు దోచుకుంటున్నాయి.

ప్రజల డబ్బుతో హీరోగా, క్రీడాకారులుగా, అవార్డు గ్రహీతలు పెద్దమనుషులుగా చలామణి అవుతున్నవారు కోట్లల్లో డబ్బు తీసుకుని ప్రజా ఆరోగ్యాన్ని నిర్వీర్యం చేసే వాణిజ్య ప్రకటనలు ఇస్తున్నారు. వీరిపై క్రిమినల్ కేసులు బనాయించాల్సిన ప్రభుత్వం వీరిని, అవార్డులతో సత్కరించడం సిగ్గుచేటు. కూల్‌డ్రింక్‌లు పిహెచ్ శాతం టాయిలెట్ క్లినర్స్ యాసిడ్‌తో సమానంగా ఉంటుంది. ఇది శరీరానికి చాల ప్రమాదకరం. స్థూలకాయం, ఊపిరితిత్తులు, బి.పి, షుగర్, ఎముకల మెత్తబడిపోవడం, కీళ్ల నొప్పులు అధికంగా ఉంటాయి. జీర్ణ వ్యవస్థను ధ్వంసం చేసి, రీనల్ ఫైల్యూర్‌కు దారి తీస్తుంది. గర్భిణీ స్త్రీలు కూల్‌డ్రింక్ సేవిస్తే పుట్టబోయే పిల్లలు పిండంపై ప్రభావం ఉంటుంది. దీర్ఘకాలిక వ్యాధులు, కిడ్నీ, లివర్, కేన్సర్ బారినపడే అవకాశం ఎక్కువగా ఉంది. తరచుగా అధిక మొత్తంలో చక్కెరతో కూడిన శీతల పానీయాలు మన దైనందిన జీవితంలో పాతుకుపోయాయి.

శీతల పానీయాలలో అధిక చక్కెర కంటెంట్ ఇన్సులిన్ నిరోధకతకు దారి తీస్తుంది. టైప్ 2 మధుమేహం వచ్చే ప్రమాదాన్ని పెంచుతుంది, చక్కెర శీతల పానీయాల అధిక వినియోగం రక్తంలో చక్కెర స్థాయిలు హృదయనాళ ఆరోగ్యంపై వాటి ప్రభావం కారణంగా రక్తపోటు, కరోనరీ ఆర్టరీ వ్యాధి స్ట్రోక్‌తో సహా గుండె జబ్బుల ప్రమాదాన్ని పెంచుతుంది. శీతల పానీయాలలో అధిక స్థాయి చక్కెర కెఫిన్ పురుషులు, స్త్రీలలో పునరుత్పత్తి ఆరోగ్యం, సంతానోత్పత్తిని ప్రతికూలంగా ప్రభావితం చేయవచ్చు. సాఫ్ట్ డ్రింక్స్‌లో ఫాస్పోరిక్ యాసిడ్ ఉంటుంది,

ఇది కాల్షియం శోషణకు ఆటంకం కలిగిస్తుంది మరియు ఎముక సాంద్రత నష్టానికి దోహదం చేస్తుంది, ముఖ్యంగా పిల్లలు, పెద్దలలో బోలు ఎముకల వ్యాధి, పగుళ్ల ప్రమాదాన్ని పెంచుతుంది. కూల్‌డ్రింక్స్ తాగడం వల్ల బరువు పెరగడం, దంత సమస్యలు, దీర్ఘకాలిక వ్యాధుల ప్రమాదం, డీహైడ్రేషన్, కిడ్నీ సమస్యలు, కేన్సర్ వచ్చే ప్రమాదం వంటి అనేక ప్రతికూల ఆరోగ్య ప్రభావాలు ఉంటాయి.

ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి శీతల పానీయాల వినియోగాన్ని పరిమితం చేయడం; నీరు, హెర్బల్ టీ లేదా సహజ పండ్ల రసాలు వంటి ఆరోగ్యకరమైన పానీయాల ఎంపికలను ఎంచుకోవడం ఉత్తమం. మజ్జిగ, కొబ్బరినీళ్ల లాంటివి అందుబాటులో లేకపోతే ఇంట్లోనే అల్లంతో చేసినటువంటి నీళ్లు, పుదీనా, కొత్తిమీర, టమాట, కరివేపాకు, మునగాకు వంటి ఆకులను ఉపయోగించి తయారు చేసిన వాటిని తాగితే ఆరోగ్యానికి మంచిది.

వేసవికాలంలో నిమ్మరసంలో ఉప్పు వేసుకుని తాగిన, వేసుకోకుండా తాగిన కూడా ఆరోగ్యానికి మంచిదే. అందుకే ఇంట్లో ఉన్న వస్తువులతో మాత్రమే మనం జ్యూస్ చేసుకుని తాగాలి. అలా అయితే ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు.

కథ

# ఆస్థానంలో వంటవాళ్లు

చంద్రగిరిని ప్రసేనుడు పాలించేవాడు. అతని మంత్రి వసంతుడు. కోటలోని వంటశాలలో కేశవుడు, రామయ్య అనేవారు పనిచేసేవారు. కేశవుడు భోజనంలోకి అన్నం, కూరగాయలతో రకరకాల రుచికరమైన వంటకాలు చేసేవాడు. రామయ్య తీపి పదార్థాలు మాత్రమే చేసేవాడు.

ఒకరోజు రామయ్య బంధువుల పెళ్లికని రాజుగారి అనుమతితో రెండు రోజులు సెలవు తీసుకుని ఊరు వెళ్ళాడు. ఆ రోజు రాజు పాయసం చేయమని వంటశాలకు కబురుపెట్టాడు. కేశవుడికి పాయసం చేయడం రాదు. కానీ రాజు గారి కోరిక మేరకు ఎలాగోలా పాయసం చేశాడు. భోజన సమయం వేళకు రాజు, మంత్రి వచ్చారు. ముందుగా పాయసం వడ్డించాడు కేశవుడు. రాజు రెండు మార్లు పాయసం తిని "ఏంటి మంత్రీ! పాయసం ఇలాగుంది?" అన్నాడు.



మంత్రి కూడా రుచి చూసి "అవును పాయసం బాగా లేదు" అని కేశవుణ్ణి మందలించాడు.

"మహారాజా! నాకు తీపివంటకాలు చేయడం రాదు" అని చేతులు జోడించి అన్నాడు కేశవుడు. మంత్రి "వంటవాడికి పాయసం చేయడం రాకపోవడమేమిటీ?" అన్నాడు రాజు.

"మహారాజా! మామూలు వంటలు చేయడానికి ఒకరిని, తీపివంటకాలు చేయడానికి మరొకరిని నియమించాం. ఎవరి ప్రత్యేకత వారిది" అన్నాడు మంత్రి.

పాయసం పాత్ర పక్కన పెట్టి, భోజనం చేసి విశ్రాంతి మందిరానికి వెళ్ళాడు రాజు.

కొన్ని రోజుల తరువాత కేశవుడు కూడా రెండు రోజుల సెలవు మీద వెళ్ళాడు.

అప్పుడు రామయ్య చేసిన వంటకాలు తిని "ఏం వంట చేశావయ్యా? ఒక్క దానిలో కూడా ఉప్పు, కారం సరిగ్గా లేవు" అని కొప్పడ్డాడు రాజు.

"మహారాజా! నన్ను క్షమించండి.. నాకు తీపి పదార్థాలు చేసినంత బాగా మామూలు వంటకాలు చేయడం రాదు" అన్నాడు రామయ్య.

"మహారాజా! నాదొక సలహా. ఇకమీదట కేశవుడు, రామయ్యలతో సహా సహాయ వంటవాళ్ల కూడా ఒక నెలలోపు అన్ని రకాల వంటలు నేర్చుకునేటట్టు ఆజ్ఞ ఇవ్వండి. అప్పుడు ఎలాంటి సమస్యలు రావు" అన్నాడు మంత్రి.

"ఇది బాగుంది. అలాగే ఆజ్ఞ ఇస్తున్నాను. కేశవుడు రాగానే అమలు చేయండి" అన్నాడు రాజు.

ఒక నెల రోజుల్లో కేశవుడు, రామయ్యలతో సహా సహాయకులు కూడా అన్నీ రకాల వంటలు చేయడం నేర్చుకున్నారు.

"హమ్మయ్య.. చిక్కుముడిని సులభంగా విప్పారు" అని మంత్రిని మెచ్చుకున్నాడు రాజు. వంటలు చేసేవారికి బంగారు నాణేలు ఇద్దాం" అన్నాపు రాజు.

"అలా వద్దు మహారాజా! కొద్దిగా జీతం పెంచితే వాళ్లు సంతోషిస్తారు" అన్నాడు మంత్రి.

"నువ్వు చెప్పింది సబబుగా ఉంది" అని వంటశాలలో పనిచేసే వారికందరికీ జీతం పెంచాడు రాజు.

వంటశాలలోని వారందరూ ఎంతో సంతోషించారు.

**న- యు.విజయశేఖర రెడ్డి,** హైదరాబాద్

బాలగేయం

## తెమ్మెర పాట

నీ చెవిని రాసుకున్న
గాలి తెమ్మెర
నా పెదాలపై
చిన్న పాటై పూస్తుంది.

మూసిన నీ
కనురెప్పల కింద..
వెలుగుతున్న
వెన్నెలపూలు
ఎప్పటికి విచ్చుతాయో
నా కన్నులముందు..!!

నిశ్చలంగా వున్న
నీ నవ్వులో..
నా గుండె సవ్వడులు..
ఎప్పటికి మీటుతాయో
నా హృదయ తంత్రులు..!!

**- జయసుధ**



## హలో ఫ్రెండ్...

**చిన్నారుల ప్రశ్నలకు**
**వార్త సిఎండి, మేనేజింగ్ ఎడిటర్**

### గిరీష్ అంకుల్ సమాధానాలు

**ఆర్. రాజు,** హైదరాబాద్

**ప్రశ్న:** ఆకాశం నుంచి జారిపడే వాన చినుకు వేగం ఏ స్థాయిలోఉంటుంది?

**జవాబు :** మేఘాలలోని నీరు వర్షంగా మారినప్పుడు భూ ఆకర్షణ శక్తికి గురవుతుంది. ఎంత ఎత్తులో నుంచి కిందకు పడినా భూమి తన పరిధిలోని వస్తువు లేదా పదార్థాలను ఒకేవిధంగా ఆకర్షిస్తుంది. అంటే వాన చినుకు ఎంత ఎత్తు నుంచి పడినా దాని వేగంలో మార్పు ఉండదు. ఒకే వేగంతో పడతాయి. గాలి బలంగా వీచినప్పుడు, ఆ గాలి తాకిడికి వర్షపు చినుకులు వేగంగా దూసుకువచ్చినట్టుగా మనం భావిస్తాం. వాన చినుకు వేగాన్ని సెకనుకు 9.8 'న్యూటన్ మీటర్లు'గా పరిగణించారు. ఐజాక్ న్యూటన్ భూమ్యాకర్షణ శక్తిని కనుకొనడం వలన, ఆకర్షణశక్తి ఆయన పేరు మీ 'న్యూటన్ మీటరు'గా కొలుస్తారు.

**బి. సరిత,** కాకినాడ

**ప్రశ్న:** ఆమ్లవర్షం అంటే ఏమిటి?

**జవాబు :** ఆమ్లాలు, క్షారాల బలాబలాలను పి.హెచ్. స్కేల్ మీద '0' నుంచి 14 సంఖ్యల వరకూ లెక్కిస్తుంటారు. స్వచ్ఛమైన నీటి పిహెచ్. విలువ ఏడు కాబట్టి ఈ పిహెచ్. స్కేలు మీద తటస్థ బిందువు ఏడుగా గుర్తించారు. ఏడుకన్నా తక్కువగా ఉన్న వాటిని ఆమ్లాలని అంటారు. ఏడు కన్నా ఎక్కువ వుంటే వాటిని క్షారాలుగా పరగరిణిస్తారు.వర్షపు నీరు సాధారణంగా కాస్త ఆమ్లపూరితమేనని చెప్పాలి. ఎందుకంటే– ఆ నీటి పిహెచ్ విలువ దాదాపుగా ఆరు వుంటుంది. అదే కాలుష్యం ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో అయితే, వర్షపు నీరు ఎక్కువగా ఆమ్లపూరితంగా ఉంటుంది. అప్పుడు ఆ నీటి పిహెచ్. విలువ నాలుగు లేదా మూడు ఉండవచ్చు. వర్షపు నీటిలో సాధారణంగా ఉండే ఆమ్ల గుణం కన్నా ఎక్కువగా ఆమ్లపూరిత లక్షణాలుంటే ఆ వర్షాన్ని 'ఆమ్ల వర్షం' అంటారు. ఆమ్లవర్షంలో మనం తడిసినా మనకొచ్చే ప్రమాదం పెద్దగా ఉండదుకానీ, ఆ నీరు భూమిలోకి ఇంకి, చెరువులు, సరస్సులలో కలిసినప్పుడు అందులోని జలచరాలకు, మొక్కలకు కొంత కాలానికి హాని కలుగుతుంది.

# నాట్యశాస్త్రానికి యునెస్కో నీరాజనం

అప్పన్న గొనప

భారతదేశం అంటే భౌగోళికంగా ఒక దేశం మాత్రమే కాదు. ఇది అనేక సంస్కృతులు, భాషలు, సాంప్రదాయాల సమ్మేళనం. మన దేశ చరిత్ర వెనుక చూసినపుడు, వేలాది సంవత్సరాల నాటివి అయిన జ్ఞాన సంపద, తత్త్వ సారాలు కనిపిస్తాయి. మనం చెప్పుకునే రామాయణం, మహాభారతం, ఉపనిషత్తులు, నాట్యశాస్త్రం, భగవద్గీత వంటి గ్రంథాలు కేవలం మతపరమైన రచనలు కావు. అవి జీవన పాఠాలు. భారతీయత అనే భావనను నిర్వచించే మూలస్తంభాలు. ఈ సాంస్కృతిక సర్వస్వానికి తాజాగా యునెస్కో ఇచ్చిన గుర్తింపు, మన దేశానికి మాత్రమే కాక, ప్రపంచ మానవ సమాజానికి ఒక గొప్ప సందేశాన్ని ఇస్తోంది. తాజాగా భగవద్గీతను, నాట్యశాస్త్రాన్ని ప్రపంచ వారసత్వంగా యునెస్కో గుర్తించడం ద్వారా భారతీయ విలువలకు, తత్త్వాలకు, కళలకు అంతర్జాతీయ గౌరవం దక్కింది.

భగవద్గీతను ఒక మతపుస్తకంగా చూడటం అన్యాయమే. అది ఒక తత్త్వశాస్త్ర గ్రంథం. జీవితంలో ఎదురయ్యే అనేక సమస్యలకు ఆత్మవిశ్వాసంతో, ధర్మబద్ధంగా ఎలా స్పందించాలో తెలిపే మార్గదర్శి . గీతలో అర్జునుడు తన కర్తవ్యం విషయంలో సందిగ్ధంలో పడినపుడు, శ్రీకృష్ణుడు ఇచ్చిన ఉపదేశం కేవలం ఆ యుద్ధానికి సంబంధించినది కాదు. అది యుగయుగాలుగా అన్ని తరాల మానవులకు వర్తించగల సందేశం. కర్మణ్యే వాధికారస్తే మా ఫలేషు కదాచన అనే వాక్యం ఎప్పటికీ మారని తత్త్వాన్ని తెలియజేస్తుంది. మనం ఫలితాల కోరిక లేకుండా, నైతికతను అనుసరించి కర్మ చేయాలని చెప్పిన ఈ సిద్ధాంతం ప్రపంచవ్యాప్తంగా మనుషుల జీవితాలను మార్చగల సామర్థ్యం కలిగి ఉంది. ఇప్పుడు ప్రపంచంలోని అనేక విశ్వవిద్యాలయాల్లో గీతాపఠనం ఒక తత్త్వశాస్త్ర అధ్యయనంగా మారింది. అది మతపరంగా కాకుండా, తాత్వికంగా , జీవన విలువల పరంగా అర్థం చేసుకుంటున్నారు. ఈ దృష్టితో యునెస్కో దీనిని ప్రపంచ వారసత్వ జాబితాలో చేర్చింది.ఇది భారతీయతకు వచ్చిన గౌరవమే కాక, ప్రపంచానికి మన జ్ఞాన సంపదను అర్థం చేసుకునే అవకాశం కూడా. గీతలోని ఉపదేశాలు విశ్వ మానవ విలువలకు దగ్గరగా ఉండటం వలన దీన్ని ఒక మానవతా గ్రంథంగా భావిస్తున్నారు.

**నాట్యశాస్త్రం – కళాసౌందర్యానికి శాస్త్రీయ మూలం....**

ఇక నాట్యశాస్త్రం విషయానికి వస్తే, ఇది కేవలం నాట్యకళకు సంబంధించిన పుస్తకం కాదు. ఇది మన కళా సంపదకు మూలమైన శాస్త్రరూపం. నాట్యం అంటే శరీరంతో చేసే విన్యాసాలు మాత్రమే కాదు. అది భావాలు, భావోద్వేగాలు, తత్త్వాలు అన్నిటినీ సమన్వయపరిచే ఒక సమగ్ర కళ. నాట్యశాస్త్రం ద్వారా హస్తముద్రలు, నవరసాలు, సంగీతమూ, నృత్యంతో కలిసి ఒక సందేశాన్ని ఎలా తెలియజేయాలో స్పష్టంగా వివరించబడింది. ఇది కేవలం కళాకారులకు ఉపకరించే పుస్తకం కాదు – మానవ భావప్రకటనకు ఒక ఆధారం.



భారతదేశంలోని అనేక నాట్య రూపాలు – భరతనాట్యం, కూచిపూడి, కథక్, ఒడిశి – అన్నింటికీ మూలంగా నాట్యశాస్త్రమే ఉంది. ఇవి ఒక ప్రాంతీయ కళలు మాత్రమే కాదు. ప్రతి నాట్యంలోనూ భావప్రకటన, శరీరచలనం, సంగీత సామరస్యం ఉన్నాయి. ఇవి మానవ అనుభూతుల సున్నితమైన ప్రతిబింబాలుగా కనిపిస్తాయి. అలాంటి గొప్ప శాస్త్రాన్ని యునెస్కో మానవ కళా వారసత్వంగా గుర్తించడం గర్వకారణం. ఇది కేవలం భారతదేశానికే గౌరవం కాదు – ప్రపంచ కళాసంపదకు ఓ కొత్త దిక్సూచిక.

“యునెస్కో గుర్తింపు గెలుపు ఘడియ కాదు – సంస్కృతిని నిలబెట్టే బాధ్యత”.

ఈ రెండు గ్రంథాలకు యునెస్కో గుర్తింపు లభించడానికి వెనుక అనేక శ్రమలు ఉన్నాయి. భారత ప్రభుత్వం, ముఖ్యంగా ఇటీవల మోదీ ప్రభుత్వంలో, భారతీయ సంస్కృతి, సంప్రదాయాల ప్రచారానికి పెద్దపీట వేయడం జరిగింది. విదేశాంగ శాఖ, యునెస్కో సంస్థలతో సమన్వయం, అంతర్జాతీయ వేదికలపై భారత ప్రతినిధుల అవగాహన, విదేశీ దేశాల మద్దతు – ఇవన్నీ కలిసివచ్చి ఈ గుర్తింపుకు దారితీశాయి. ఇది అనుకోకుండా జరిగిన పరిణామం కాదు. దీని వెనుక భారతీ యతను ప్రపంచానికి వివరించాలనే సంకల్పం ఉంది. ఈ గుర్తింపు మనకు ఎంతో గర్వాన్ని కలిగించినప్పటికీ, ఇది ఒక బాధ్యతను కూడా గుర్తుచేస్తోంది. మనం ఈ సంపదను కాపాడాలి. యువతకు ఈ జ్ఞానాన్ని చేరవేయాలి. మన విద్యా వ్యవస్థలో ఈ అంశాలకు ప్రాధాన్యత ఇవ్వాలి. చిన్నతనంలో నుంచే భగవద్గీత యొక్క తాత్విక భావాలను, నాట్యకళలోని సున్నితతను, మన సంప్రదాయాల విలువను నేర్పాలి. ఇది కేవలం పాఠ్యాంశంగా కాకుండా, ఒక జీవన విధానంగా ఉండాలి.

ప్రపంచీకరణ, డిజిటల్ యుగం, బహుళ సంస్కృతుల మధ్య నేటి యువత కొంత అయోమయంలో వుంది. ఇలాంటి సమయంలో భగవద్గీత వంటి తత్త్వ గ్రంథం, నాట్యశాస్త్రం వంటి కళా శాస్త్రం యువతకి దిశానిర్దేశం చేయగలవు. మన సంప్రదాయాల గొప్పతనాన్ని ఈ తరానికి తెలియజెప్పడమే కాక, వాటిని సజీవంగా ఉంచే మార్గాలను అన్వేషించాలి. అంతే కాక, యువతను పరిశోధనలవైపు ప్రేరేపించాలి.



తెలుగు రాష్ట్రాల్లో మనం ప్రత్యేకంగా గమనించాల్సిన విషయం ఉంది. మనకు కూచిపూడి అనే ప్రాచీన నాట్యకళ ఉంది. ఇది నాట్యశాస్త్రానికి ప్రాణంలా ఉంటుంది. కానీ, మనం ఈ కళను ఎలా సంరక్షిస్తున్నాం అనే ప్రశ్న మనల్ని కాసేపు ఆలోచనలో పడేస్తుంది. ప్రభుత్వాల ప్రమాణీకరణ లేకపోవడం, ప్రోత్సాహం తక్కువగా ఉండటం, పరిశోధనలకు సరైన వనరులు లేకపోవడం వల్ల, మన కళలు కనుమరుగవుతున్నాయి. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక నాట్య పాఠశాలలు, కళా విశ్వవిద్యాలయాలు, పరిశోధనా కేంద్రాలు స్థాపించాలి. కూచిపూడి నాట్యకళను ప్రపంచానికి తెలియజేయగల ప్రణాళికలు తయారు చేయాలి.

ఇప్పటి వరకు గీతా, నాట్యశాస్త్రం వంటి అంశాలను పాశ్చాత్య దేశాలు చాలాసార్లు పౌరాణిక రచనలు, లేదా తక్కువ విలువ ఉన్న విషయాలుగా చూశాయి. కానీ ఇప్పుడు అదే ప్రపంచం వాటిని శాస్త్రీయంగా అంగీకరిస్తోంది. ఇది ఒక పెద్ద సంస్కృతిక మార్పు. మన గ్రంథాలలో ఉన్న విజ్ఞానం, జీవన సత్యాలు, తత్త్వాలు ఇప్పుడు ప్రపంచానికి ఉపయోగపడుతున్నాయి. ఇది గర్వించదగ్గ విషయం. కానీ మనం ఇక్కడే ఆగకూడదు. ఇది ఒక ప్రారంభం మాత్రమే. మన సంపదను ప్రదర్శించడంలో కాకుండా, పరిరక్షించడంలో మన శ్రద్ధ ఉండాలి. మన కళలు, తత్త్వాలు, సంప్రదాయాలు ముమ్ముందు తరాలకు చేరాలంటే, మనం వీటిని జీవితంలో భాగంగా మార్చుకోవాలి. భగవద్గీత మనకు ధర్మబద్ధమైన జీవితం గురించి చెబుతుంది. నాట్యశాస్త్రం మన భావాలను ఎలా తెలియజేయాలో నేర్పుతుంది. ఈ రెండు గ్రంథాలు కలిపి, ఒక సమగ్ర భారతీయతను సూచిస్తున్నాయి.

ప్రపంచం మన సంపదను గుర్తించిన ఈ సందర్భంలో మన బాధ్యతలు పెరిగాయి. ఇది కేవలం ఒక పురస్కారం కాదు – ఇది ఒక పిలుపు. మన తరం నుంచి వచ్చే తరాల వరకు మనం అందించే విలువలకు ఇది మౌలికమైన గుర్తింపుగా ఉండాలి. గీతా, నాట్యశాస్త్రం వంటి గ్రంథాల పరిరక్షణ మనకు లభించిన అవకాశంగా కాకుండా, ఒక కర్తవ్యంగా భావించాలి. భారతీయత అనేది మాటల్లో చెప్పే భావం కాదు. అది అనుభవంలో, ప్రవర్తనలో, జీవనశైలిలో ప్రత్యక్షమవుతుంది. గీతలోని ధర్మబద్ధతను మన వృత్తిజీవితంలో కూడా పాటించాలి. నాట్యశాస్త్రంలోని కళాసౌందర్యాన్ని మన వ్యక్తిత్వంలో కూడా కలుపుకోవాలి. మనం మన జ్ఞాన సంపదను గౌరవించాలి. మనం గౌరవిస్తే, ప్రపంచం కూడా గౌరవిస్తుంది.

తుదకు, మనం ఈ గౌరవాన్ని ఒక ఘనతగా కాకుండా, ఒక జ్ఞాపకంగా తీసుకోవాలి. ఇది మన గొప్పతనానికి గుర్తింపు కాదు – మన కర్తవ్యానికి గుర్తింపు. మనం బాధ్యతగా ఈ సంపదను రక్షించాలి. యువతను దాని వైపు మళ్ళించాలి. విద్య, పరిశోధన, కళ, తత్త్వశాస్త్రం – అన్నింటిలో మన సంపదను అర్థవంతంగా వినియోగించాలి. అప్పుడు మాత్రమే ఈ యునెస్కో గుర్తింపు సార్థకం అవుతుంది. ఇది నాట్యం లాంటి కళలకు, గీతా లాంటి తత్త్వాలకు సజీవత కలిగించడానికి మనం తీసుకునే తొలి అడుగు కావాలి. ●

## తెలియకుండానే ఖర్చు

ఆన్‌లైన్‌లో తగ్గింపు అని కనిపించినా, సరదాగా బయటికి వెళ్లినా ఒకటో రెండో డ్రెస్సులు వెంటబెట్టుకొచ్చేస్తారు. అప్పటికే బోలెడు క్రీములు ఇంట్లో ఉన్నా.. ఎవరో సిఫారసు చేశారనో, తక్కువకే వస్తున్నాయనో మరిన్ని తెచ్చేస్తుంటారు. అప్పుడు అమ్మల నుంచి ఎదురయ్యే ప్రశ్న.. ఇప్పటికే ఉన్నాయిగా? మళ్లీ ఇవన్నీ ఎందుకు? దండగ ఖర్చు కాకపోతే' అనే కదూ! నిజంగానే ఎందుకిలా కొనేస్తాం? కొన్ని వస్తువులు, దుస్తులు ఎంత నచ్చినా ఆర్థిక పరిస్థితి అనుకూలించక కొనలేరు కొందరు. అదలా మనసులో నాటుకుపోతుందేమో.. సొంతంగా సంపాదించడం మొదలు పెట్టాక తెలియకుండానే అలా ఖర్చు చేస్తుంటారు. కొందరికి ఆర్థిక పరిస్థితులు బాగున్నా అల మరాలు నింపేస్తా రుగా అంటే.. దానికీ కారనముంది అంటున్నాయి కొన్ని పరిశోధ నలు. ఆత్మ విశ్వా సంగా కనిపించడానికి అమ్మాయిలు ఎంచుకునే మార్గాల్లో దుస్తులూ ఒకటి. వాళ్ల వ్యక్తిత్వం, స్టైల్‌ని వాటి ద్వారా వ్యక్తపరుస్తారట. అందుకే ఎన్ని ఉన్నా తాజా ధోరణులను తెలుసుకుని మరీ వేసుకున్నా వేసుకోకపోయినా దుస్తులు, చెప్పులు వగైరా కొంటూనే ఉంటారు. ఇంకొందరైతే అలా కొనడం ద్వారా ఒత్తిడి దూరమైనట్లుగా భావిస్తారు. అందుకే 'ఎందుకింత ఖర్చు' అన్నా తీరు మాత్రం మార్చుకోలేరు. బ్యూటీ ఉత్పత్తుల మాటేంటి? ముఖ్యమైన సందర్భం.. అందంగానో, నలుగురిలో ఉత్తమంగానో కనిపించాలనుకుంటారు. తీరా ఏ కాటుకో, మరేదో కనిపించదు.. చూసేవాళ్లకు చిన్నగానే కనిపిస్తుంది. మనసులో ఆ లోటు వాళ్లకి తెలుస్తూనే ఉంటుంది. సందర్భమేదైనా 'పర్‌ఫెక్ట్'గా ఉండాలనుకునే అమ్మాయిలే ఎక్కువ. అలాంటివాళ్లు వీటినెలా తట్టుకుంటారు చెప్పండి. అందుకని ముందుగానే సిద్ధంగా ఉండాలన్న తాపత్రయంలో తెలియకుండానే ఇలా ఖర్చు చేస్తుంటారు.

ఈ తీరు ఇబ్బంది కదా! అంటే.. అవుననే అంటున్నాయి అధ్యయనాలు. ఖర్చు పెట్టే స్థోమత ఉందన్న ధైర్యం, అందుబాటులో ఉన్న క్రెడిట్ కార్డు అనవసర ఖర్చేమో అన్న ఆలోచనే రానీయడం లేదట. కాబట్టి, నెలకి దుస్తులు, సౌందర్య ఉత్పత్తులకు ఇంత అని బడ్జెట్ పెట్టుకోవాలి. దాని తు.చ. తప్పకుండా పాటించడమే దీనికి సరైన పరిష్కారం అంటున్నారు నిపుణులు. ఒకవేళ దానిలో మిగిలితే మరుసటి నెలకు బదిలీ చేసుకోవచ్చు. పరిధి దాటితే మాత్రం అడ్డుకట్ట వేసుకోవడం ఒక్కటే మార్గం. ■

# రాజుగారి తోట

తాళ్ళూరి చంద్రశేఖర్

రాజుగారి తోటతో ఆంజనేయులు అనుబంధం ఈ రోజుది, నిన్నటి కాదు. దాదాపు ముప్పైఏళ్ల అవినాభావ సంబంధం అది. చదువైపోయాక ఉద్యోగరీత్యా ఆంజనేయులు రాజుగారి తోటగుండా ప్రతి రోజు ప్రయాణం చేయవలసి వచ్చేది. రాజుగారి తోటంటే అసలా ఊరికే ఓ ప్రత్యేకత. ఆ ఊరిలో ఎవర్ని అడిగినా రాజుగారి తోట గురించి గొప్పగా చెప్పుకుంటారు, ఆ తోట తమదే అయినట్టు. ఆ తోట గురించి ఒక్క మాటలో చెప్పాలంటే ఊరికి నడిబొడ్డున ఉండి ఊరిని రెండు భాగాలుగా విడదీస్తుంది.

ఎప్పుడో ఆ ప్రాంతాన్ని పాలించిన ఒక రాజు గారు ఆ తోటలో నివాసముండేవారు. దాదాపు రెండు చదరపు మైళ్ల వైశాల్యం ఉన్న ఆ తోటకి ఒక వైపుగా పెద్ద భవనం ఉండేది. తోటంతా పెద్ద పెద్ద చెట్లు. తోట చుట్టూ పెద్ద ప్రహరీ గోడ, మరో మూల పెద్ద గేటు ఉండేవి.



కాలక్రమంలో రాజరికాలు పోయాక ఆ భవనం శిథిలావస్థకు చేరుకుంది. రాజుగారి వారసులందరు ఎక్కడో దూరంగా పరాయి దేశాలలో స్థిరపడడంతో ఆ తోటని చూసుకునే నాథుడే లేకపోయాడు. ప్రహరీ గోడ కూడా వానలకు పూర్తిగా నానిపోయి అక్కడక్కడ కూలిపోయింది కూడా. తోటకి ఒక వైపున మధ్య తరగతి జనావాసాలు ఉంటే మరో వైపు వాణిజ్య సముదాయాలు, ధనికవర్గపు భవంతులు సమృద్ధిగా ఏర్పడ్డాయి. ఊరికి ఒక వైపునుండి మరో వైపుకి వెళ్లడానికి వాహనదారులు, అధిక శాతం పాదాచారులు తోట చుట్టూ ఉన్న రహదారిని ఉపయోగించినా, కొందరు పాదచారులు మాత్రం కూలిన ప్రహరిగోడ ద్వారా తోటలో నుండి వెళ్లడానికి అలవాటుపడ్డారు. అయితే చీకటి పడ్డాక మాత్రం తోట దారిని ఎవరూ ఉపయోగించేవారు కాదు.. పురుగు పుట్రా ఉంటాయని.

తోట దారికి బాగా అలవాటు పడిన వారిలో ఆంజనేయులు కూడా ఒకడు. రోజూ పొద్దుటే తోట దారిగుండా తను పని చేసే ఆఫీసుకు వెళ్ళి సాయంత్రం ఇంటికి అదే దారిలో తిరిగి వచ్చేవాడు. రహదారి ద్వారా ప్రయాణించడానికి స్కూటర్ ఉన్నా తోట దారిలో నడుచుకుంటూ వెళితే వ్యాయామం కూడా చేసినట్టు ఉంటుందని రోజూ అదే దారి ఉపయోగించేవాడు.

ప్రతి శనివారం రోజు పొద్దుటే ఇంటికి దగ్గరలోనే ఉన్న ఆంజనేయస్వామి మందిరానికి వెళ్ళి పూజ చేయించి అటునుంచి అటే ఆఫీసుకి వెళ్ళడం ఆంజనేయులుకి ఉన్న మరో అలవాటు. ఆ రోజంతా అతను ఉపవాసముండేవాడు. పూజ సామాగ్రితో పాటు రెండు డజన్ల అరటి పళ్ళు కూడా కొని తోటలో చెట్ల పైన నివాసముండే వానర దండుకి ఆ అరటి పండ్లను తినిపించేవాడు. అవి తింటుంటే ఆ స్వామే వాటిని ఆరగిస్తున్నట్టు అనుభూతి చెందేవాడు. ఆ వానర మూక కూడా శనివారాలు ఆంజనేయులు తోటలోకి ప్రవేశించగానే ఎక్కడెక్కడినుండో బిలబిలమంటూ వచ్చి అతని చుట్టూ మూగేవి.

అలా సజావుగా సాగుతున్న ఆంజనేయులు జీవితంలో ఒక రోజు అనుకోని విపత్తు ముంచుకొచ్చింది. ప్రతి శనివారంలాగే ఆ రోజు ఉదయం కూడా ఆంజనేయులు పొద్దుటే గుడిలో పూజ చేయించి, అరటి పళ్ల తోటలోని వానరదండుకి సమర్పించి ఆఫీసు చేరుకున్నాడు.

ఆ రోజు నెల మొదటి రోజు కావడంతో ఆఫీసులో పని చాలా ఎక్కువగా ఉండి ఆంజనేయులు పని ముగించుకునేసరికి చాలా ఆలస్యమయింది.

చలికాలం కావడంతో బయట చీకట్లు తొందరగానే ముసురుకున్నాయి. ఆఫీసువారిచ్చిన నెల జీతం తన హ్యాండ్ బ్యాగ్‌లో పెట్టుకుని ఇంటికి బయల్దేరాడు ఆంజనేయులు. మొదట రహదారిగుండా ఇంటికి వెళదామనుకున్నాడు కానీ తోటగుండా వెళ్ళితే త్వరగా ఇల్లు చేరుకోవచ్చుని, రోజూ వెళ్ళే మార్గమే కదా! భయమెందుకని తోటలో నుంచే వెళ్ళడానికి నిర్ణయించుకున్నాడు.

తోటలో కొద్ది దూరం నడిచాక ఆ కటిక చీకట్లో, గుబురైన చెట్ల మధ్య ఒంటరిగా నడవడం కాస్త భయమనిపించింది ఆంజనేయులుకి. బాగా చీకటి పడటం మూలాన్న మరో మనుష్యమాత్రుడెవడు సమీపంలో కనిపించలేదు. ఆంజనేయులు అలాగే టార్చ్ లైట్ వెలుగులో నడవసాగాడు.

ఆంజనేయులు తోట మధ్యకి చేరుకునేసరికి ఆకస్మాత్తుగా నలుగురు దుండగులు ఎక్కడినుంచో వచ్చి అతన్ని చుట్టుముట్టారు. నలుగురి చేతిలో చిన్న, చిన్న బాకులున్నాయి. ఆ బాకులతో అతన్ని బెదిరించి అతని దగ్గరున్న డబ్బంతా ఇవ్వమని బెదిరించారు.

**పూజ సామాగ్రితో పాటు రెండు డజన్ల అరటి పళ్లు కూడా కొని తోటలో చెట్ల పైన నివాసముండే వానర దండుకి ఆ అరటి పండ్లను తినిపించేవాడు. అవి తింటుంటే ఆ స్వామే వాటిని ఆరగిస్తున్నట్లు అనుభూతి చెందేవాడు.**

ఆంజనేయులు కొద్దిగా ప్రతిఘటించబోతే నలుగురు కలిసి పట్టుకుని అతని దగ్గరున్న హ్యాండ్ బ్యాగ్‌ని, జేబులో ఉన్న పర్సుని, మెడలో ఉన్న బంగారు గొలుసుని లాక్కుని ఆంజనేయులుని వెళ్లిపొమ్మని బెదిరించారు.

అంత డబ్బుతో ఆ రాత్రివేళ ఒంటరిగా మనుష్యమాత్రుడు లేని ఆ దారిగుండా ప్రయాణించినందుకు తనని తాను తిట్టుకుంటూ బతుకుజీవుడా! అని ఆంజనేయులు ఆ దుండగులు చెప్పినట్టే ముందుకు నడక సాగించాడు.

అతను నాలుగడుగులు ముందుకు వేశాడో లేదో వెనక ఏదో పెద్ద కలకలం వినిపిస్తే వెనుతిరిగి చూసి ఆశ్చర్యంతో అవాక్కయ్యాడు.

ఎక్కడినుంచి వచ్చాయో ఏమో పెద్ద వానర మూక దండు ఆ నలుగురు దుండగుల్ని చుట్టుముట్టి నానా యాగీ చెయ్యసాగాయి. ఆ దుండగులు వాటిని అదిలించినకొద్దీ వాటిలో కొన్ని ఇంకా మీద మీదకి వచ్చి వారిని రక్కసాగాయి. మరికొన్ని వారి చేతిలో ఉన్న వస్తువులని లాక్కొసాగాయి.

వానర మూక దాడి ధాటిని తట్టుకోలేక ఆ నలుగురు దుండగులు వారి చేతిలోని వస్తువులను ఎక్కడికక్కడ వదిలేసి పరుగెత్తుకుంటూ పారిపోయారు.

వారు వెళ్లిపోగానే అంతవరకు ఎంతో భీకర రూపం దాల్చిన ఆ వానరమూక ఒక్కసారిగా శాంతించింది. వాటిలో ఒక వానరం ఆంజనేయుని హ్యాండ్ బ్యాగ్, పర్సు, బంగారు గొలుసు తెచ్చి అతనికిచ్చింది.

చెమర్చిన కళ్లతో ఆ వానరం ఇచ్చిన వస్తువులను తీసుకుంటూ మనఃస్ఫూర్తిగా ఆ వానర దండుకి నమస్కరించాడు ఆంజనేయులు, సాక్షాత్తూ ఆ వాయునందనుడే వచ్చి తనను రక్షించాడని తలుస్తూ.

## విశ్లేషణాత్మకంగా ఆలోచించాలంటే..

సెలవులొస్తే హోమ్ వర్క్‌లు చేయడం, టైంకి నిద్రపుచ్చడం, పొద్దున్నే స్నాక్స్, లంచ్ తయారీ... వీటినుంచి తల్లులకు ఉపశమనం లభిస్తుంది. కానీ ఇప్పుడు ఇంకో సమస్య తలెత్తుతుంది. పిల్లలు రోజంతా ఇంట్లో ఉంటూ.. 'ఎందుకు, ఏమిటి, ఎలా' అంటూ.. ప్రశ్నల వర్షం కురిపిస్తారు. దాంతో పెద్దవాళ్లకు విసుగు, చిరాకు వస్తాయి. అయితే వారిలో ఆ ప్రశ్నించే లక్షణాన్ని ప్రోత్సహించే నిపుణులు. విశ్లేషణాత్మకంగా ఆలోచించడానికి అది కీలకమట. సమాచారాన్నీ, వాదనల్నీ అన్ని కోణాల్లో విన్నాక మంచిచెడ్డల్ని గుర్తించగలగడమే క్రిటికల్ థింకింగ్. పుస్తకాలు, ఫోన్, టీవీ, స్నేహితుల తద్వారా బోలెడంత సమాచారం పిల్లల బుర్రల్లో చేరుతోంది. ఈ నేపథ్యంలో వాస్తవాన్ని గ్రహించేలా పిల్లల్ని సిద్ధం చేయాలి.



### అందుకోసం ఏం చేయాలంటే..

ప్రశ్నించడం, తార్కికంగా ఆలోచించడం చాలా ముఖ్యం. ఇవి చిన్నప్పుడే అలవాటు కావాలి. అప్పుడే విశ్లేషణాత్మక ఆలోచనలు సహజంగా వస్తాయి.

ప్రతి ప్రశ్నకు ఒకటే జవాబు ఉంటుందనుకునేలా కాకుండా, వివిధ కోణాల్లో విశ్లేషిస్తే ఒకటికి మించిన జవాబులు ఉంటాయని చెప్పండి.

నిర్ణయం తీసుకునే, సమస్యను పరిష్కరించే సందర్భం వచ్చినప్పుడు పిల్లల స్పందన కోసం ఆగండి కానీ ముందే మీరు వాళ్లకు ఏదో ఒకటి చెప్పేయకండి.

పిల్లలకు ఏదైనా చేయమనీ, చేయొద్దనీ చెప్పినప్పుడు.. మీరలా చెప్పడం వెనక కారణాన్ని వివరించండి. వీగన్ డైట్ మంచిదంటే సరిపోదు, దానివల్ల ఆరోగ్యంతో పాటు జంతువులు, పక్షులు, పర్యావరణానికి ఎలాంటి మేలు జరుగుతుందో అర్థమయ్యేలా వివరించాలి.

ఏదైనా సందర్భంలో వారు చెప్పిన ఒక్కటే జవాబుకు ఊ కొట్టకుండా. ప్రత్యామ్నాయాల గురించీ అడగండి.

ఏదైనా సమస్యను పరిష్కరిస్తున్నప్పుడు మీరు ఎందుకలా చేస్తున్నారో వివరిస్తూ ఆ పనిని పూర్తి చేయండి.


## రచనలకు ఆహ్వానం

రచయితల నుండి కథలు, కవితలు, సమకాలీన వ్యాసాలు స్వాగతిస్తున్నాం. రచనలతో పాటు మీ పేరు, చిరునామా, హామీపత్రం తప్పనిసరిగా జత చేయాలి. ఎంపిక కాని రచనలు తిప్పి పంపగోరేవారు తగిన పోస్టేజీ జత చేసిన కవరు పంపించాలి. ఇతర పత్రికల పరిశీలనలో ఉన్న రచనలు దయచేసి పంపించకండి. రచనలు పంపించాల్సిన చిరునామా:

**ఎడిటర్, ఆదివారం వార్త**, నం.396, లోయర్ ట్యాంక్ బండ్, డిబిఆర్ మిల్స్ పక్కన, హైదరాబాద్-80.

# భగవంతుని ప్రతిరూపం అమ్మ

అమ్మ భాషకు అందని గొప్ప భావం కనిపించే ప్రత్యక్ష దైవం. ఆది గురువు అమ్మ మంచి నడత, నడక నేర్పేది అమ్మ. తల్లిని మించిన ప్రేమ మూర్తి ఈ ప్రపంచంలోనే లేదంటే అతిశయోక్తి కాదు. ఈ ప్రపంచం ఆధునికతతో తన రూపం మార్చుకున్న అమ్మ ప్రేమ అజరామజరం, ఎన్నటికీ చెరగని మధురానుభవం. అమ్మ ఆశీస్సులు కొండంత అండ. తన ప్రాణాలను సైతం లెక్కచేయకుండా గుండెల్లో దాచుకొని కాపాడే మనసత్తత్వం కేవలం అమ్మకి మాత్రమే ఉంటుంది.

ఈ సృష్టికి మూలమైన అమృత భాండం పంచే అనురాగం, మమకారం, ఆప్యాయత వెలకట్టలేని ప్రేమ అమ్మది. అందుకే ఆ నింగి కూడా తలవంచుతుంది అమ్మ పంచే అనురాగానికి సముద్రం కూడా చిన్న బోతుంది. అమ్మ తనలో దాచుకున్న కన్నీళ్లను చూసి వెన్నెల కూడా దాసోహం అవుతుంది తన అందమైన ఆత్మీయతకి అమృతం కూడా అవసరం ఉండదు అమ్మ చేతి గోరుముద్దలకి. అందుకే అమ్మలో సహనం, క్షమాగుణం, ఓర్పు, స్నేహం లాంటి అద్భుతమైన ప్రవృతులు సజీవంగా ఉంటాయి. అమ్మ లేకపోతే జననం లేదు. అమ్మ లేకపోతే గమనం లేదు, అమ్మ లేకపోతే ఈ సృష్టి లేదు. దేవుడు లేడనే మనిషి ఉంటాడు కానీ అమ్మ లేదనే మనిషి ఉండడు. మనిషి జీవితాంతం వెంట ఉండేది తల్లి ప్రేమే. ఈ ప్రపంచం తల్లికిచ్చిన గౌరవం వేరే ఏ బంధానికి ఇవ్వదు. తల్లి ప్రతిక్షణం తన బిడ్డ కోసమే పరితపిస్తూ ఉంటుంది. 10 నెలలు మోసి పాలిచ్చి పెంచి బిడ్డకు ఎన్నో సేవలు చేస్తుంది. ఆశలన్నీ ధారపోసి పెంచుకుంటుంది. అమ్మ ప్రేమలో ఎలాంటి స్వార్థం ఉండదు. అహర్నిశలు కష్టపడుతుంది. ఎన్ని కష్టాలెదురైనా బిడ్డ సుఖం కోసం చిరునవ్వుతో అధిగమిస్తుంది.

అందుకే ఈ లోకంలో అన్నింటి కన్నా అమూల్యమైనది, అతి మధురమైనది, అనంతమైనది అమ్మ అనురాగం మాత్రమే. ఎన్ని బంధాలు ఉన్నా మాతృప్రేమలో ఉన్న అనుభూతి మాటలకందనంత గొప్పగా ఉంటుంది. ఇంత గొప్ప ప్రేమామృత మూర్తిని పూజించే రోజు ఎలా వచ్చిందో అంటే 'యాన్ మేరియా జార్విస్' అనే మహిళ అమెరికన్ సివిల్ వార్ టైంలో 'వార్ స్లోజర్స్'కి చాలా సేవలు చేసింది. అంతేకాకుండా 'మదర్స్ డే వర్క్స్ క్లబ్'ని స్థాపించి పబ్లిక్ హెల్త్ కోసం పనిచేశారు. ఆమె మరణించిన తర్వాత ఆమె కూతురు అన్న జార్విస్ తన తల్లి చేసిన సేవలకి గుర్తుగా మాతృదినోత్సవాన్ని సెలవు రోజుగా ప్రకటించమని 1905 నుంచి క్యాంపెయిన్ మొదలు పెట్టింది. ఆ



తర్వాత 1908లో తన తల్లిని గుర్తు చేసుకుంటూ మెమోరియల్ సెయింటళ్ యాండ్రోస్ మెథడ్రా లాజికల్ చర్చిలో మొట్టమొదటిసారిగా మాతృదినోత్సవాన్ని జరిపారు. కానీ అధికారికంగా మాతృదినోత్సవం కోసం 1908లో పెట్టిన ప్రపోజల్‌ని రిజెక్ట్ చేసింది. యూఎస్ గవర్నమెంట్ ఆ తర్వాత 1911లో అధికారికంగా మాతృదినోత్సవాన్ని ప్రభుత్వం వారే ప్రకటించారు. అప్పటినుండి ప్రపంచవ్యాప్తంగా ప్రతి సంవత్సరం మే రెండవ ఆదివారం రోజున మనమంతా మాతృదినోత్సవాన్ని జరుపుకుంటున్నాం. మన సంస్కృతిలో మాతృ దేవోభవ, పితృ దేవోభవ, ఆచార్య దేవోభవ అని చెప్పారు. అంటే తల్లి తండ్రి, గురువు దైవంతో సమానం.

మనం తల్లిని పూజిస్తాం దైవంతో సమానంగా చూస్తాం. అందుకే దేవుడు అన్ని చోట్ల ఉండలేక అమ్మని సృష్టించాడు. ఈ సృష్టిలోని జీవరాశులన్నింటి పుట్టుకకు ఆమేనమూల కారణం. ప్రతి మనిషికి తొలి గురువు అమ్మ. మనం వేసే ప్రతి అడుగును నడిపించే మార్గదర్శి. దేవతా మూర్తులంతా కూడా అమ్మ ఆలనా పాలనలోనే అంతటివారయ్యారు. అందుకే స్వర్గం ఎక్కడుంది అంటే తల్లి పాదాల చెంతనే ఉంది అంటారు పెద్దలు. మనం ఈ భూమాత పొత్తిళ్లలోకి రావడానికి 9 నెలల ముందు నుంచే అమ్మ తన కడుపులో దాచుకొని కంటికి రెప్పలా కాపాడుతుంది మనల్ని. తాను పురుటి నొప్పుల్ని పంటి బిగువున భరిస్తూ మనకి అద్భుతమైన, అందమైన జన్మనిస్తుంది. మనం ఆకలి అని అడగకముందే పాలిచ్చి లాలిస్తుంది. మనకి మాటలు రాకపోయినా అర్థం చేసుకొని మన అవసరాలకు తెలుసుకొని అన్ని ప్రేమతో అందిస్తుంది, తీరుస్తుంది. మనం పాఠశాలకు వెళ్లకముందే ఎన్నో పాఠాలు నేర్పిస్తుంది. మనకి స్నేహితు లంటే ఎవరో తెలియక ముందు మనతో స్నేహం చేసి ఆడిస్తుంది, లాలిస్తుంది. ప్రాణప్రదంగా చూసుకుంటుంది.

ఇలా అమ్మ గురించి ఎంత చెప్పినా తరగని కావ్యంగానే ఉంటుంది. దేవతలకు అమృతాన్ని పంచిన దేవుడు అంతకంటే కమ్మనైన ప్రేమామృతాన్ని అమ్మ ద్వారా మనకు అందించాడు. ఇంతకంటే అదృష్టం ఉంటుందా? ఈ జన్మకు. అందుకే లోకమంతా ఓ వైపు ఉంటే/ అమ్మవైపు నేనుంటానంటాడు' ఓ కవి.

అమ్మ ఉంటే అన్ని ఉన్నట్టే. అందరూ ఉన్నట్టే. ఓదార్చిన, ఓ దారి చూపిన, బాధను తరిమిన, బాధ్యతను తెలిపిన బంగారు భవిష్యత్తును అందించిన అది అమ్మ దీవెనే కొలిస్తేనే పలికేది ఆ దేవుడు కానీ పిలవకుండా పలికేదీ అమ్మ మనసు మాత్రమే. ప్రపంచంలో పూజించాల్సిన వ్యక్తి ఎవరైనా ఉన్నారు అంటే ఆమె కన్న తల్లి. మాతృదేవోభవ అంటూ అమ్మని పూజిద్దాం, అమ్మ మనసు గెలుచుకుందాం. ■

# రేమండ్ టవర్ చరిత్ర

**యేచన్ చంద్రశేఖర్**

హైదరాబాదీలకు అంతగా తెలియని రేమండ్ టవర్ చరిత్ర "ముత్యాల నగరం" లేదా "పర్ల్ సిటీ"గా ప్రపంచ ప్రసిద్ధిగాంచిన మన భాగ్యనగరానికి శతాబ్దాల ఘనచరిత్ర ఉందన్న విషయం మనందరికీ తెలుసు. ప్రతి సంవత్సరం హైదరాబాద్, సికింద్రాబాద్ జంటనగరాలను సందర్శించే వేలాది మంది స్వదేశీ, విదేశీ పర్యాటకులను నగర శోభను పెంచే అనేక స్మారక చిహ్నాలు, సమాధులు, రాజభవనాలు, ఇతర చారిత్రక కట్టడాలు ఎంతగానో ఆకట్టుకుంటాయి. అలాంటి వాటిలో మూసారాంబాగ్‌లోని రేమండ్ సమాధి కూడా ఒకటి.

దక్షిణ హైదరాబాద్‌లోని శివారు ప్రాంతమైన మలక్‌పేటలోని టీవీ టవర్ దాటి పైకి ఒక మార్గం వెళుతుంది. 18వ శతాబ్దంలో నిజాం రాజులకు సేవలందించిన ఫ్రెంచ్ మిలటరీ కమాండర్ మాన్సియర్ రేమండ్ పేరు మీదుగా ఒకప్పటి హైదరాబాదు నగర పాత శివారు ప్రాంతమైన దీనికి "మూసారామ్‌బాగ్" అని పేరు వచ్చింది. బాగ్ అంటే ఉద్యానవనం అని అర్థం. ఈ ప్రాంతం ఒకప్పుడు భారీ పచ్చదనంతో నిండి వుండేది. ఇదే కాదు, ఒకప్పుడు జంటనగరాలలోని చాలా ప్రాంతాలు ఉద్యానవనాలు, సెలయేళ్లతో అత్యంత ఆహ్లాదకరంగా ఉండేవి. హైదరాబాద్‌లోని దర్శనీయ స్థలాలలో ఒకటైన ఇప్పటి పబ్లిక్ గార్డెన్స్‌ను గతంలో 'బాగ్ఎఆమ్' అని పిలిచేవారు. దీనికి తెలుగు అర్థం "ప్రజల ఉద్యానవనం".

### భాగ్యనగరంతో అనుబంధం

1755లో ఫ్రాన్స్‌లోని గాస్కోనీలో జన్మించిన మాన్సియర్ రేమండ్, తన సోదరుడు విలియం జీన్ రేమాండ్‌తో కలిసి 1775లో పాండిచ్చేరికి వచ్చి అక్కడ వ్యాపారం ప్రారంభించాడు. ఈ ఔత్సాహిక ఫ్రెంచ్ సాహసికుడు 1788లో బ్రిటిష్ వారి చేతిలో పాండిచ్చేరి ఓడిపోయిన తరువాత, రేమండ్ మైసూర్‌కు వెళ్లి, చెవాలియర్ డి లాస్సే కార్ప్స్‌లో సబ్‌లెఫ్టినెంట్‌గా హైదర్ అలీ సైన్యంలో బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా అనేక పోరాటాలలో పాల్గొన్నాడు. హైదర్ అలీ మరణం తర్వాత, కెప్టెన్ హోదాలో అతను ఫ్రెంచ్ జనరల్ బుస్సీకి ఏడిసిగా పనిచేశాడు. 1786లో డి బుస్సీ మరణం తర్వాత, హైదరాబాద్ నిజాం సేవలో చేరాడు. సాధారణ సైనికుడిలాగా చేరిన ఆయన కొంతకాలం తర్వాత 300 మంది సైనికులతో "ఫ్రాంకోయిస్ కార్ప్స్" పేర స్థానిక రెజిమెంట్‌ను స్థాపించి కమాండర్‌గా ఎదిగి నిజాం విశ్వాసాన్ని గెలుచుకొని అతని ఆస్థానంలో గణనీయమైన ఫ్రెంచ్ ప్రభావాన్ని నెలకొల్పాడు. ఈ సైనికులు గొప్ప ఫ్రెంచ్ విప్లవానికి చిహ్నంగా ఉన్న క్యాప్ ఆఫ్ లిబర్టీ లాంటి తలపాగాలను ధరించడం, ఈ ఫ్రెంచ్ కమాండర్ విప్లవాత్మక ఫ్రాన్స్ విలువలను సుదూర హైదరాబాద్‌లో ఎలా ప్రతిబింబింప చేయాలనుకున్నాడో చెప్పకనే చెబుతుంది. 1796లో, రేమండ్ అమర్



ఎజెన్సీ లేదా ఆర్డినెన్స్ కంట్రోలర్‌గా నియమించబడ్డాడు. మంచి నాణ్యతగల ఆయుధాలను అందించడానికి, ఆయన 1786లో తుపాకులు, ఫిరంగుల తయారీ కోసం ఒక తుపాకీ ఫౌండ్రీని స్థాపించాడు. వీటి శిథిలాలు ఇప్పటికీ హైదరాబాద్ నడిబొడ్డున మనకు దర్శనమిస్తాయి.

ఫౌండ్రీ ఇప్పుడు రక్షిత స్మారక చిహ్నం, దాని చుట్టూ ఉన్న ప్రాంతం ఇప్పటికీ గన్‌ఫౌండ్రీ అనే పేరును కలిగి ఉంది. ఫతే మైదాన్ (విక్టరీ గ్రౌండ్) సమీపంలోని గన్ ఫౌండ్రీ లేదా టాప్ కా సాంచా భారతదేశంలోని మిగిలిన ఫౌండ్రీలలో అత్యంత ప్రసిద్ధి చెందింది. ఆయుధశాల ఫౌండ్రీని స్థాపించిన తర్వాత అతను తయారు చేసిన తుపాకులు, ఫిరంగులు చాలా ప్రసిద్ధి చెందాయి, దేశంలో, అంతకు ముందు లేదా తరువాత, ఇంత నాణ్యమైన మందుగుండు సామగ్రి ఎప్పుడూ తయారు చేయబడలేదు. 1790లో, అతను మైసూర్‌కు చెందిన టిప్పు సుల్తాన్‌తో పోరాడాడు. నాలుగు సంవత్సరాల తరువాత, మరాఠాలు నిజాం నుండి చౌత్‌ను డిమాండ్ చేసినప్పుడు, రేమండ్ వారి సైన్యంతో యుద్ధం చేశాడు. దీనికి యాదృచ్ఛికంగా ఫ్రెంచ్ జనరల్ పెరాన్ కూడా నాయకత్వం వహించాడు.

నిజాం కుమారులలో ఒకరైన మీర్ అలీ జా 1795లో తండ్రిపై తిరుగుబాటు చేసి బీదర్ కోటను ఆక్రమించినప్పుడు, అతను బీదర్‌ను స్వాధీనం చేసుకుని తిరుగుబాటు చేసిన యువరాజును ఖైదీగా ఇంటికి తీసుకువచ్చాడు. ఇందుకుగాను ఆయన మెదక్ జిల్లాను వ్యక్తిగత జాగీర్‌గా బహుమతిగా అందుకున్నాడు. మార్చి 25, 1798న మరణించే నాటికి అతను 14,000 మందికి పైగా సైనికులకు కమాండర్ అయ్యాడు. 1800లో లార్డ్ వెల్లెస్లీ అనుబంధ ఒప్పందంపై సంతకం చేయడంతో, రేమండ్ ఏర్పాటు చేసిన సైన్యాన్ని నిజాం రద్దు చేయాల్సి వచ్చింది. ఆయన అసఫ్ జాహీ వంశస్థుడైన నిజాం అలీ ఖాన్, (నిజాం2) కి సన్నిహిత మిత్రుడిగా మారి నిజాం చేత ఎంతో గౌరవించబడటమే కాకుండా, తన దయాగుణం మరియు ధైర్యం కారణంగా స్థానిక ప్రజల ఆదరాభిమానాలను కూడా గెలుచుకున్నాడు. విదేశీయుడు అయినప్పటికీ, అతను నిజాం అలీకి ఇష్టమైన వ్యక్తి అయ్యాడు. నిజాం అతడిని తన సొంత కొడుకులా చూసుకున్నాడు. అఘర్‌ఇజంగ్ (యుద్ధాల డ్రాగన్), అజ్దర్ ఉ దౌలా (ప్రభువులలో డ్రాగన్), ముత్వర్‌ఉల్‌ముల్క్ (రాష్ట్రంలో ధైర్యవంతుడు) అనేవి నిజాం రేమండ్‌కు ఇచ్చిన కొన్ని బిరుదులు.

ఆయన క్రైస్తవాన్ని విడిచిపెట్టినప్పటికీ, ఆయనను అమితంగా ఆరాధించే హైదరాబాదీలకు అతను హిందువా లేదా మహమ్మదీయుడా అని కచ్చితంగా తెలియదు. ముస్లింలకు అతను మూసారహీమ్ కాగా హిందువులకు మూసారామ్. అతను కేవలం 43 సంవత్సరాల వయసులో దీర్ఘకాలిక విషప్రయోగం లేదా ఆత్మహత్య కారణంగా మరణించాడని భావించినప్పటికీ అది ఇప్పటికీ రహస్యంగానే మిగిలిపోయింది. ఆయన మరణానంతరం, హైదరాబాద్ నగరంలోని మలక్‌పేట శివార్లలోని కొండపై ఉన్న నిజాం కోట అయిన అస్మాన్‌ఘర్ సమీపంలోని ఒక కొండపై ఆయన అంత్యక్రియలు నిర్వహించారు. గ్రీకు ప్యాలెస్ ఆఫ్ విండ్స్‌ను సూచించే స్తంభాల పెవిలియన్ కింద ఆయనను ఖననం చేశారు. నేడు, హైదరాబాద్ నగరం విస్తరించింది మరియు మలక్‌పేట శివారు ప్రాంతాలు ఇప్పుడు నగరంలో భాగమయ్యాయి.

### మాన్సియర్ రేమండ్ సమాధి

భారతదేశంలో లెక్కకు మించి చారిత్రక ప్రదేశాలు, కోటలు మరియు స్మారక చిహ్నాలు ఉండగా, వాటిలో కొన్ని జాతీయ సంపదగా, కొన్ని ప్రపంచ వారసత్వ సంపదగా బాగా నిర్వహించ బడుతున్నప్పటికీ మరికొన్ని మాత్రం పూర్తిగా నిర్లక్ష్యానికి గురవుతున్నాయి. ఒకప్పుడు నగర శివారు ప్రాంతంలో ఉన్న రేమండ్ సమాధి ఇప్పుడు కిక్కిరిసిన జనావాసాలతో చుట్టుముట్టబడి దగ్గరకు వెళ్తే తప్ప కనిపించే పరిస్థితి లేదు. దురదృష్టవశాత్తూ, స్వాతంత్రం తర్వాత, ఈ సమాధి చాలా కాలం పాటు నిర్లక్ష్యానికి గురి కావడంతో పాటు అక్టోబర్ 2001 వర్షాల సమయంలో పెవిలియన్ కూలిపోయింది. రక్షిత స్మారక చిహ్నంగా ప్రకటించబడిన దీనిని రూ.5 లక్షల వ్యయంతో పునర్నిర్మించిన అనంతరం దీనిని ఏప్రిల్ 14, 2003న ప్రజల సందర్శనార్థం పునఃప్రారంభించారు. పునర్నిర్మాణం తర్వాత కూడా నిర్లక్ష్యం కొనసాగి చివరికి,

**కొన్ని ప్రపంచ వారసత్వ సంపదగా బాగా నిర్వహించ బడుతున్నప్పటికీ మరికొన్ని మాత్రం పూర్తిగా నిర్లక్ష్యానికి గురవుతున్నాయి. ఒకప్పుడు నగర శివారు ప్రాంతంలో ఉన్న రేమండ్ సమాధి ఇప్పుడు కిక్కిరిసిన జనావాసాలతో చుట్టుముట్టబడి దగ్గరకు వెళ్తే తప్ప కనిపించే పరిస్థితి లేదు.**

2009లో సమాధి, దాని చుట్టుపక్కల ప్రాంతాలకు కొత్త రూపురేఖలు కల్పించారు. ఇది ఇప్పుడు ఒక పర్యాటక ప్రదేశం. తెలంగాణ వారసత్వశాఖ ఏర్పాటు చేసిన త్రిభాషా (తెలుగు, ఉర్దూ ఇంగ్లీష్) ఫలకం సమాధి సముదాయానికి సందర్శకులను స్వాగతిస్తుంది. ఈ సముదాయం అందంగా అలంకరించబడిన తోటలు చదును చేయబడిన మార్గాలతో పూర్తి చేయబడింది.

రేమండ్ సమాధి వరకు ఒక మార్గం వంకరగా ఉంటుంది. ఆ సమాధి నల్ల గ్రానైట్ రాయితో, శంఖాకారంగా, దాదాపు 7 మీటర్ల ఎత్తులో ఉంది. ఒబెలిస్క్ (స్థూపం) నాలుగు వైపులా జోచిమ్ రేమండ్ యొక్క మొదటి అక్షరాలు నల్లరాయితో ఇటాలిక్ ఫార్మాట్‌లో రాయబడి ఉంటాయి. ఈ సముదాయం పై కప్పు 28 స్తంభాలపై ఆధారపడి ఉంటుంది. 1950 వరకు ఆయన మరణించిన రోజున ఈ ప్రదేశంలో క్రమం తప్పకుండా ఉర్స్ (వేడుక) నిర్వహించబడేది. ఆయన పెంపుడు కుక్క, ప్రియమైన గుర్రం సమాధులు కూడా అదే స్థలంలో ఉండేవి. కొంతకాలం క్రితం వరకు, ఆయన మరణ వార్షికోత్సవం సందర్భంగా ప్రజలు ఆయన సమాధిని సందర్శించి, ధూపం, ఇతర నైవేద్యాలను ఆయనకు సమర్పించేవారు. భారత స్వాతంత్రం తర్వాత నిజాంలు తమ అధికారాన్ని కోల్పోయే వరకు, ప్రతి సంవత్సరం మార్చి 25న ఆయన సమాధికి చెరూట్లు పెట్టె, బీరు బాటిల్‌ను పంపేవారు. ఇదే ప్రాంగణంలో 1809లో ప్రసవ సమయంలో మరణించిన అతని భార్య ఆన్ జానెట్ ఎలిజబెత్ జెంకిన్స్ మృతదేహాన్ని ఉంచిన మరొక సమాధి కూడా ఉంది. పుట్టిన కొద్దిసేపటికే మరణించిన శిశువు మృతదేహం కూడా సమాధిలో ఉంది. ఈ సమాధి దీర్ఘ చతురస్రాకార ఘనపదార్థం ఆకారంలో ఉంది, దానిపై నల్ల రాయితో శిలాఫలకం ఉంటుంది. దాని పక్కన రేమండ్ మాదిరిగానే ఒక ఒబెలిస్క్ ఉంది, కానీ ఎత్తు తక్కువగా ఉంటుంది.

మాన్సియర్ రేమండ్ సమాధి ఫ్రాన్స్ మరియు భారతదేశం మధ్య స్నేహాన్ని ప్రతిబింబిస్తుంది. ఆనాటి హైదరాబాదీలు ఎంతగానో అభిమానించిన ఆ ఫ్రెంచ్ జనరల్ జ్ఞాపకార్థం ఈ ప్రదేశానికి మూసారాంబాగ్ అనే పేరు వచ్చింది.

ఈ చారిత్రిక ప్రాంతాన్ని సురక్షితంగా ఆకర్షణీయమైన దర్శనీయ ప్రాంతంగా మార్చేందుకు ప్రభుత్వం ఆర్కియాలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా మరింత కృషి చేయాల్సి ఉంటుంది. ■

## మెల్లకన్ను సరిచేయవచ్చా?



పిల్లలకు చిన్నతనంలోనే మెల్ల ఉన్న విషయాన్ని గమనిస్తే తప్పనిసరిగా డాక్టర్‌ని సంప్రదించాలి. ఐ సైట్ ఎక్కువగా ఉండి. క్రాస్ అయిన కంటిచూపు తక్కువగా ఉందా అన్న విషయాన్ని నిర్ధారించాలి. ఇలాంటి సమస్యలను 'లాజీ ఐ' అని కూడా అంటారు. ఈ సమస్య ఉన్నప్పుడు చూపు బాగా ఉన్న కన్నుని మూసేసి మెల్ల ఉన్న కన్నుని కొంచెం స్టిమ్యులేట్ చేస్తుంటారు. సాధారణంగా మెల్ల ఉన్నప్పుడు చూడడానికి ఒక కంటినే ఉపయోగిస్తుంటారు. ఉదాహరణకు కుడి వైపు కంటితో చూస్తున్నప్పుడు ఎడమవైపు కంటికి మెల్ల ఉంటుంది. ఎడమవైపు కంటితో చూసినప్పుడు కుడి వైపు కంటికి మెల్ల ఉంటుంది. ఒక వేళ రెండు కళ్లతో ఒకేసారి చూసినప్పుడు మెదడు దాన్ని 'డబుల్ విజన్'గా గుర్తించి రెండు వస్తువుల్లాగా చూపిస్తుంది. ఇలా ఒక కంటితో చూడడం వల్ల అవతలి వారికి అందవికారంగా కనిపిస్తుంటుంది. అలాగే రెండు కళ్లూ ఒకేసారి ఉపయోగించపోవడం వల్ల కొన్ని రకాల వస్తువులను సరిగా చూసే అవకాశం ఉండదు. అంటే మీరు త్రీ డైమెన్షన్‌ను చూడలేరు. ఇలాంటప్పుడు స్క్వింట్‌ని తప్పనిసరిగా కరెక్ట్ సరి చేయాల్సి అవసరం ఉంటుంది.

వాస్తువార్త
వాస్తు విద్వాన్ సాయిశ్రీ
డా॥ దంతూరి పండరినాథ్
సెల్: 9885446501/9885449458



# వేధలు-బాధలు



'**వేధ**' అంటే 'వేధించే సామర్థ్యం కలదని; 'పోటు' అంటే బాధించే సామర్థ్యం కలదని అర్థం. చెడు ఫలితాలనిచ్చే సామర్థ్యం వున్నదాన్ని ఒక 'దోషం'గా పరిగణింపవచ్చు. అలా 'వేధలు', 'పోటులు' వాస్తు విషయంలో దోషాలుగా పరిగణింపబడ తాయి. వీటి గురించి కనీస అవగాహన ఉంటే వీటిని తెలుసుకోవటం చాలా తేలిక. ఈ విషయాలు తెలియకుంటే ఒక(మన) ఇంటికి ఈ దోషాలున్నాయనీ, ఆ దోషాల వలన ఇల్లు బాధింపబడు తుందనీ, తద్వారా మనకు చెడు ఫలితాలు ప్రాప్తిస్తున్నాయన్న విషయం కూడా తెలియదు. అనేక సంవత్సరాలు అలాగే ఉండిపోతారు.

ధనాన్ని, కాలాన్ని, ఆరోగ్యాన్ని నష్టపోతూ ఉంటారు. విషయం తెలిస్తే జాగ్రత్త పడటం, తద్వారా ఇంటిని, పంటిని, సమయాన్ని, ధనాన్ని కాపాడుకుంటూ విజయాలను సులభంగా సొంతం చేసుకుంటూ జీవనయానం కొనసాగించవచ్చు.

## ముఖ్యమైన వేధలు

**శ్లో॥ అంతఃపరం ప్రవక్ష్యామి గృహాణాం వేధ నిర్ణయం । అంధకం రుధిరం చైనకుబ్జం కాణాం బధీరకం ॥ దిగ్భ్రమం చిపిటం చైన, వ్యంగ్యం, చ ముజరంతథా ।**
**కుటిలం కుట్టకం చైవ సుప్తంచ శంఖపాలకం ॥**
**వికటంచ తథా కంకం కైకరం షోడశస్మృతం ॥**

తా॥ అంధకము, రుధిరము, కుబ్జము, కాణము, బధిరము, దిగ్భ్రమము, చిపిటము, వ్యంగ్యము, ముజరము, కుటిలము, కుట్టము, సుప్తము, శంఖపాలము, వికటము, కంకము, కైకరము అనే పదహారు విధాల వేధా దోషాలు ఒక శాఖగా పేర్కొనబడ్డాయి.

## రోగబాధలున్నాయా?

**అంధక వేధ:** 'అంధకం' చిద్రహీనం స్యాత్' అనే ప్రమాణమునననుసరించి, ఒక గృహానికున్న ముఖ్య ద్వారానికి రెండు వైపుల కూడా గవాక్షములు(కిటికీలు) లేనట్లయితే, ఆ గృహం 'అంధక వేధ' అనే వాస్తుదోషం కలిగి వుందని చెప్పవచ్చు.

'అంధకేరోగముతులంస్యాత్' అంధక వేధా దోషం గల ఇంటిని పొందినవారు ఎల్లప్పుడూ రోగ బాధను కలిగి ఋణబాధను, సంతాన నష్టాన్ని కూడా పొందే అవకాశం ఉంది. ఈ దోషం సరిచేసుకొన్నట్లయితే దోష నివారణ జరిగి సత్ఫలితాలు పొందవచ్చు.

## ఎప్పుడూ భయమేస్తూ ఉంటుందా?

**రుధిర వేధ:** ఒక గృహం ప్రామాణిక మైన కొలతలతోగాక విపరీతమైన హెచ్చు, తగ్గు కొలతలతో నిర్మించబడి ఉండటం వలన 'రుధిరంచ విషమాంగకం' అనే శాస్త్రవచనం ప్రకారం 'రుధిర వేధ' అనే వాస్తు దోషం కలిగివుందని చెప్పవచ్చు. 'రుధిరేతి సారజంభయం' అందువల్ల ఇష్టానుసారం గదుల నిర్మాణం చేయకుండా వాస్తు ప్రకారం గదుల వైశాల్యాన్ని నిర్ధారించుకొని గృహ నిర్మాణం గావించాలి. ఇటువంటి వేధా దోషం వలన ఆ గృహ యజమానిగానీ, గృహిణికిగానీ, ఆ గృహంలో నివసించేవారందరుగానీ, కొందరుగానీ, ఒకరి తరువాత మరొకరుగానీ ఎప్పుడూ అతిసార వ్యాధిని, భయాన్ని పొందుతూ ఉంటారు. గృహంలో పైన పేర్కొన్న బాధలు ఉన్నట్లయితే వాస్తు నిపుణుల పర్యవేక్షణలో సవరించుకొని సత్ఫలితాలు పొందే ప్రయత్నం గావించాలి. వీలులేని చోట ప్రత్యామ్నాయ పద్ధతులను తప్పక ఆచరించాలి.

## భవిష్యత్తు ఎలా ఉంటుంది?

వై.ఎస్ – కరీంనగర్

**ప్రశ్న: ఇది మా అమ్మాయి సమస్య. మా అమ్మాయి జాతక చక్రంలో సప్తమ(7) స్థానంలో సూర్యుడు(రవి), కుజుడు ఉన్నారు. 2012 సంవత్సరంలో మా అమ్మాయి తప్పు లేకున్నా ఒక నింద కూడా పడింది. దాదాపు రెండు సంవత్సరాలు తాను కోలుకోలేదు. ఆరోగ్య, మానసిక సమస్యలను ఎదుర్కొంటోంది. భవిష్యత్తు ఎలా ఉంటుందోనన్న విషయం అలా వుంచి, మా అమ్మాయి వివాహం, వైవాహిక జీవితం బాగుపడేలా తగిన సలహా ఇవ్వగలరని ఆశిస్తున్నాను.**

**జవాబు:** కంగారు పడాల్సిన అవసరం లేదు. ఇక్కడ పేర్కొన్న రెండు పనులు ముందు చేయండి. 1) ఆదివారం రోజున: మంజిష్ఠ ఎరుపు, కుంకుమ, గజమదము, రక్త చందనము రాగి పాత్రలో కలిపి స్నానం చేయటం. రక్తవర్ణ వస్త్రం, బెల్లం, రక్తచందనం, కంచు గుర్రం, పద్మాలు ఆ రోజున అమ్మాయిచేత దానం చేయించండి.

2) మంగళవారం రోజున: దేవదారు గంధం, చంద్రకర గంధం, ఉసిరిక పప్పు వెండి పాత్రలో కలిపి స్నానం చేయటం. పగడం, కందులు, బెల్లం, బంగారం ఎర్రని వస్త్రం, రాగి మొదలైన వాటిని అదే రోజున ఆ అమ్మాయి చేత దానం చేయించండి. పై రెండు కార్యక్రమాలు పూర్తి చేసుకున్న తరువాత వారం రోజులలో వచ్చి వ్యక్తిగతంగా కలవండి. మీ సమస్య పరిష్కారమయ్యే అవకాశాలు మీకే తెలుస్తాయి.

✦

వాస్తు విద్వాన్ డా॥ దంతూరి పండరినాథ్ పాఠకుల సమస్యలకు ఆదివారం 'వాస్తువార్త'లో సమాధానాలిస్తారు. ఈ కింది కూపన్ జతచేసి సమస్యలు పంపవలసిన చిరునామా: సాయిశ్రీ వాస్తు కన్సల్టెన్సీ, 3-2-4, కింగ్స్‌వే, రాష్ట్రపతి రోడ్, సికిందరాబాద్-3

వాస్తువార్త

పూర్తి పేరు : ........................................
పుట్టిన తేది : ........................................
జన్మ నక్షత్రం: ................తల్లి పేరు: ............
చిరునామా:............................................

కోట దామోదర్

# జలం వినా జీవనం నాస్తి

నీరు లేకుండా ఏ జీవి కూడా బతకజాలదు, అందుకనే "జలం వినా జీవనం నాస్తి" అంటారు. మనం నీటిని పొదుపుగా ఉపయోగిస్తే, ప్రతి నీటిచుక్క మన భవిష్యత్తు తరాలను కాపాడుతుంది. మనం నీటిని వృధా చేస్తే, మన భవిష్యత్తు తరాలు అందుకు మూల్యం చెల్లించాల్సి ఉంటుంది. పెరిగిపోతున్న నీటి ఎద్దడికి నిదర్శనం గత సంవత్సరం బెంగళూరులో జరిగిన తీవ్ర నీటి కొరత పరిస్థితులు. జనాభాకు తగినట్టు నీటి సరఫరా ఉండడంతో, కొన్నేళ్ల క్రితం వరకు ప్రధాన నగరాల్లో నీటి కొరత అంత తీవ్రంగా ఉండేది కాదు. కానీ ఇప్పుడు పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా అత్యధికంగా భూగర్భ జలాల వినియోగం, పట్టణీకరణ మరియు పారిశ్రామికీకరణ కారణంగా యధేచ్ఛగా అటవీ నిర్మూలన వంటి అంశాలతో నీటి సమస్య మరింత తీవ్రమవుతోంది. పర్యావరణ అసమతుల్యత కారణంగా వర్షాభావ పరిస్థితులు ఏర్పడడం, వర్షపు నీటి సంరక్షణ, మెరుగైన సరస్సు నిర్వహణ లేకపోవడం వల్ల నీటి సమస్య గణనీయంగా పెరిగింది. నీటి సమస్యను అధిగమించాలంటే ప్రతి ఒక్కరూ చైతన్యవంతులై సుజల దీప్తికి బాటలు వేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. బాల్యం నుంచే నీటి పొదుపు జీవన శైలిలో ఒక భాగంగా మార్చాల్సి ఉంది. బెంగళూరు నీటి సంక్షోభాన్ని గట్టెక్కించేందుకు రెయిన్ రీచ్ కార్యక్రమం ద్వారా పర్యావరణవేత్త హరిహరన్ చంద్రశేఖర్ చేపట్టిన చొరవ ప్రతి ఒక్కరిని ఆలోచింపజేస్తుంది.

చాలా నగరాలలో యేటా కురిసే వర్షపాతంలో దాదాపు 90 శాతం వృధా అవుతోంది. నగరాలలో సరస్సులు మారుతుందని పర్యావరణవేత్త డాక్టర్ హరిహరన్ చంద్రశేఖర్ పాఠశాల విద్యార్థులకు నీటి సంరక్షణ గురించి అవగాహన కల్పించడానికి రెయిన్ రీచ్ కార్యక్రమాన్ని ప్రారంభించారు.

బెంగళూరు నీటి సంక్షోభం ప్రతి ఒక్కరికి ఒక గుణపాఠం వంటిది. నీటి సమస్యను అధిగమించడానికి పొదుపు



మంత్రాన్ని జపించాల్సిందేనని రెయిన్ రీచ్ కార్యక్రమం ద్వారా మున్సిపల్ పాఠశాలల్లో వర్షపు నీటిని సురక్షితమైన తాగునీటిగా మార్చడానికి వడపోత వ్యవస్థతో కూడిన వర్షపు నీటి సేకరణ వ్యవస్థను ఏర్పాటు చేసింది. ఇది కాకుండా, వర్షపాతాన్ని,

కనుమరుగవడం, వర్షపు నీరు భూమిలోకి ఇంకకుండా రోడ్ల నిర్మాణం చేపట్టడంతో భూగర్భ జలాలు అడుగంటుతున్నాయి. నగరాలలో కురిసే వర్షపునీరు డ్రైనేజీ గుండా నేరుగా నదుల్లోకి చేరడం వల్ల భూగర్భజలాల పునరుద్ధరణకు అవకాశం లేదు. నీటిని సంరక్షించడానికి మన జీవనశైలిలో మార్పులు అవసరమని భావించి, పిల్లలలో సరైన అవగాహన కల్పిస్తే తద్వారా నీటిని ఆదా చేయడం చిన్నప్పటి నుండే అలవాటుగా



డేటాలాగ్‌ను ఎలా కొలవాలో పిల్లలకు శిక్షణ ఇవ్వడం, వర్షపు నీరు శుద్ధి చేసే ప్రక్రియను అర్థం చేసుకోవడానికి పిల్లలకు సహాయపడే రెయిన్ గేజ్ వాతావరణ స్టేషన్‌ను ఏర్పాటు చేసి తద్వారా పిల్లలకు పూర్తి అవగాహన ఏర్పడేలా అనుభవం కలిగిన నిపుణులతో వారికి శిక్షణ ఇస్తారు. ప్రతి నెలా పిల్లలకు నీటి సంరక్షణ గురించి అవగాహన కల్పిస్తూ, నీటి దుర్వినియోగంతో భవిష్యత్తులో ఎలాంటి పరిణామాలు చోటు చేసుకుంటాయో అర్థమయ్యేలా, వ్యవస్థలను ఎలా జాగ్రత్తగా చూసు కోవాలో నేర్పిస్తారు. ఈ కార్యక్రమం ఫలితంగా బెంగళూరులోని 40 పాఠశాలలు ఇప్పటివరకు 34 మిలియన్ లీటర్ల నీటిని ఆదా చేయడం గర్వించదగిన విషయం. విద్యార్థుల ఈ కృషిని స్ఫూర్తిగా తీసుకుని దీనిని ప్రతిఒక్కరూ అలవర్చుకుంటే నీటికి దోకా ఉండదు. రెయిన్ రీచ్ సిస్టమ్ మాత్రమే కాదు, మిలియన్ వెల్స్ ఫర్ అనే సంస్థ కూడా బెంగళూరులో నీటి సంక్షోభాన్ని పరిష్కరించే లక్ష్యంతో కీలకమైన చొరవను చేపట్టింది.

బెంగళూరు నీటి సరఫరా, మురుగు నీటి పారుదల బోర్డుకు మద్దతుగా ఉన్న ఈ ప్రాజెక్ట్, సాంప్రదాయ బావి మైనింగ్ పద్ధతులను ఉపయోగించి నగరం అంతటా పది లక్షల లోతు బావులు నిర్మించడానికి ప్రయత్నిస్తోంది. బావి నిర్మాణం పురాతన పద్ధతులను ఉపయోగించడం ద్వారా, భూగర్భజల వనరులను సమర్థవంతంగా ఉపయోగించడానికి ప్రయత్నిస్తుంది, 2025 నాటికి పూర్తి చేయడానికి షెడ్యూల్ చేయబడిన మిలియన్ వెల్స్ ఫర్ బెంగళూరు ప్రాజెక్ట్ బెంగళూరుకు నీటి భద్రతను నిర్ధారించే దిశగా ప్రయత్నిస్తోంది.

బెంగళూరు మాదిరిగానే హైదరాబాద్‌లో కూడా నీటి సంక్షోభం ఏర్పడే అవకాశం లేకపోలేదు. రోజురోజుకు పెరుగుతున్న ఎండల తీవ్రతతో భూగర్భ జలాలు అడుగంటి పోతున్నాయి. భూగర్భ జలాలు అడుగంటడానికి ఎన్నో కారణాలున్నప్పటికీ, అధిక నీటి వినియోగంతో పాటు వర్షపు నీటిని ఒడిసి పట్టి భూమిలోకి ఇంకింపచేయడంలో నగర వాసులు విఫలం కావడం ప్రధాన కారణాలుగా చెప్పొచ్చు. అయితే వర్షం నీటిని భూమిలోకి ఇంకింపచేయడంలో నగరవాసుల అలసత్వం ఒక కారణమైతే, ఈ అంశంపై ప్రభుత్వం తగిన ఆసక్తిని చూపకపోవడం మరో కారణం. ప్రతిచోటా సిసి రోడ్ల నిర్మాణం కారణంగా నగరంలో ఏటా కురిసే వర్షం నీరు భూమిలోకి ఇంకే అవకాశం చాలా తక్కువ. వర్షం నీరు భూమిలోకి ఇంకాలంటే అందుకు ఇంకుడు గుంత ద్వారానే సాధ్యం అని గ్రహించి మొదటిసారిగా ఇంకుడు గుంతల ఆలోచన ద్వారా జలయజ్ఞానికి శ్రీకారం చుట్టి వర్షపు నీటిని భూమిలోకి ఇంకింపచేసిన వ్యక్తి బాకారం వద్ద గల పద్మశాలి కాలనీ వాస్తవ్యులు రాజాపేట ఆంజనేయులు. 1997లో ఒకసారి ఆయన అధికారిక పనుల నిమిత్తం గుజరాత్‌లోని రాజ్‌కోట్ సందర్శించిన సందర్భంగా అక్కడ కొందరు స్త్రీలు రోజంతా తలపై బిందెలు పెట్టుకుని నీళ్లు మోసే దృశ్యం ఆయనకు తీవ్ర బాధ కలిగించింది. అంతేకాక అప్పటికే తమ కాలనీలో కూడా భూగర్భ జలాలు తగ్గి నీటి ఎద్దడి ఏర్పడి ట్యాంకర్లపై ఆధారపడవలసి రావడంతో ఆయన మస్తిష్కంలో మొదటిసారి ఇంకుడు గుంతల ద్వారా జలయజ్ఞం చేపట్టాలనే సంకల్పానికి బీజం పడింది. వెంటనే ఆయన తమ కాలనీలోని భావసారూప్యత గల ఐదుగురు మిత్రులతో కలిసి 31 జూలై 1997న ప్రయోగాత్మకంగా పూర్తి శాస్త్రీయ ప్రమాణాలతో ఇంకుడు గుంతలను ఏర్పాటు చేశారు. తొలి ప్రయత్నంలోనే ఆంజనేయులు శ్రమ ఫలించి భూగర్భజల మట్టం పెరగడంతో కాలనీలోని మిగతావారు కూడా ఆయన సారథ్యంలో ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకుని ఉపశమనం పొందారు. భూగర్భ జలాలు పెరగడానికి, నీటి ఎద్దడి నివారణకు ఇంకుడు గుంత తప్పనిసరని నిరూపించిన రాజాపేట ఆంజనేయులు ఇంకుడు గుంత ఆలోచనను ప్రతి ఒక్కరూ పాటిస్తే నగరంలో నీటి చింత ఉండబోదు.



తమిళనాడు రాష్ట్రానికి చెందిన మాజీ ఐఎఎస్ అధికారిణి శాంతా షీలా నాయర్ వ్యూహాత్మక ప్రణాళిక, విధాన రూపకల్పన నైపుణ్యం వల్ల చెన్నై తీవ్ర నీటిసంక్షోభాన్ని ఎదుర్కొనేందుకు దోహదపడింది. 2001లో ఆమె తమిళనాడు బోర్డు కార్యదర్శిగా ఉన్నప్పుడు తీవ్రమైన కరువు ఏర్పడింది. అప్పటి తమిళనాడు ముఖ్యమంత్రి వర్షపు నీటి సంరక్షణ ప్రాజెక్టును ప్రారంభించి, మొత్తం బాధ్యతను ఆమెకు అప్పగించారు. ఆ తర్వాత ఆమె అన్ని భవనాల్లో వర్షపు నీటి సంరక్షణను తప్పనిసరి చేస్తూ ఒక ఆర్డినెన్స్ జారీ చేసింది. నాయర్ సూచన మేరకు చెన్నైలోని ప్రజలందరూ ఇంటి అవసరాలకోసం ప్రత్యేక ట్యాంకులు, పైపులను ఏర్పాటు చేసుకొని వర్షపు నీటి సంరక్షణకు పూర్తి మద్దతు ఇచ్చారు. ఈ చొరవ నీటి సంక్షోభాన్ని తగ్గించడంలో సహాయపడటమే కాకుండా నగరంలో స్థిరమైన నీటి నిర్వహణ పద్ధతులకు ఉదాహరణగా నిలిచింది. నీటికొరత పరిస్థితులు మరింత తీవ్ర రూపం దాల్చకముందే దిద్దుబాటు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. భూగర్భ జలాలను పెంపొందించడంతో పాటు వృథా నీటిని ఒడిసి పట్టేందుకు ప్రతి ఒక్కరూ ఇంకుడు గుంతల నిర్మాణం నిర్వహణ ఒక ఉద్యమంలా చేపడితే, భవిష్యత్తులో నీటిసమస్య ఉండదు.

✦


## కార్టూన్లకు ఆహ్వానం

కార్టూనిస్టుల నుండి ఆరోగ్యకరమైన హాస్యాన్ని అందించే కార్టూన్లను స్వాగతిస్తున్నాం. అంశం ఏదైనా సరే! మంచి హాస్యాన్ని అందించాలి. కార్టూన్లతో పాటు మీ పేరు, చిరునామా, హామీ పత్రం తప్పనిసరిగా జత చేయాలి. ఎంపిక కాని కార్టూన్లను తిప్పి పంపగోరేవారు తగిన పోస్టేజీ జత చేసిన కవరు పంపించాలి. కార్టూన్లు పంపించాల్సిన చిరునామా:

**ఎడిటర్, ఆదివారం వార్త, నం.396, లోయర్ ట్యాంక్ బండ్, డిబిఆర్ మిల్స్ పక్కన, హైదరాబాద్-80.**

sunmagvaartha@gmail.com

# అతి ప్రాచీన శివలింగం

**అతి ప్రాచీన తొలి శివలింగంగా గుడిమల్లం శివాలయం ప్రశంసలందుకుంటోంది. ఇది ఆంధ్రప్రదేశ్, ఆసియా ఖండంలో తొలి ప్రాచీన శివలింగమని కొందరు చెబుతుండగా, ప్రపంచంలో, అసలు ఈ భూమండలంలో తొలి శివలింగమని, ఇదే తొలి శివాలయం అని కొందరు ఘంటాపథంగా చెబుతున్నారు. ఎవరి నమ్మకాలు వారివి. అయితే గుడిమల్లంలో వున్నది ప్రాచీన శివలింగం అనడంలో ఎటువంటి సందేహం లేదు.**

**షేక్ అబ్దుల్ హాకీం జాని**

అత్యంత పురాతనమైన శివలింగం కాశీ, రామేశ్వర క్షేత్రాల్లో కూడా లేదనేది ఈ ప్రాంత భక్తజనుల ప్రగాఢ విశ్వాసం. ఆంధ్రప్రదేశ్‌లోని చిత్తూరు జిల్లా ఏర్పేడు మండలంలోని గుడిమల్లం అనే కుగ్రామంలో శ్రీ పరశురామేశ్వరస్వామి వారి దేవాలయంలో ఈ శివలింగం ఉంది. చిత్తూరు జిల్లా రేణిగుంటకు 11 కి.మీ. దూరంలోను, తిరుపతి నుంచి 22 కి.మీ. దూరంలో గుడి మల్లం శివాలయం సువర్ణముఖీ నది తీరంలో నెలకొని ఉంది.

పురావస్తుశాఖ పరిశోధనల ప్రకారం క్రీస్తుపూర్వం ఒకటో శతాబ్దానికి చెందిన ఆలయంగా గుర్తించగా 1908 నాటికే బ్రిటిష్ ప్రభుత్వం ఈ ఆలయాన్ని గుర్తించింది. చోళ, పల్లవ, గంగ పల్లవ, రాయల కాలంలో నిత్యం ధూప, దీప, నైవేద్యాలతో కళకళలాడిన ఈ ఆలయాన్ని 1954లో గుడిమల్లం గ్రామస్తుల నుండి ఆర్కియాలజీ సొసైటీ ఆఫ్ ఇండియా స్వాధీనం చేసుకుంది. ఆనాటి నుండి గుడిలో పూజలు ఆగిపోయాయి. చాలా విగ్రహాలు చోరీకి గురయ్యాయి. గుడిమల్లం ఆలయాన్ని 1954లో ఆర్కియాలజికల్ సొసైటీ ఆఫ్ ఇండియా (ఆశీ) స్వాధీనం చేసుకొని రక్షిత కట్టడంగా ప్రకటించి సంరక్షిస్తుంది. 1968 నుంచి 1972 వరకు వరసగా ఈ ఆలయంలో గణేశ, శివకామసుందరి, ఆనందవల్లి, నటరాజు, లక్ష్మీ విగ్రహాలు ఒక తోరణంతో కలిపి మొత్తం 9 పంచలోహ విగ్రహాలు చోరీకి గురై తిరిగి దొరికలేదు. ఇంగువ కార్తికేయ శర్మ రచించిన పరమేశ్వర టెంపుల్ ఎట్ గుడిమల్లం, ద డెవలప్‌మెంట్ ఆఫ్ ఎర్లీ శైవ ఆర్ట్ అండ్ ఆర్కిటెక్చర్, ఆర్కియాలజీ వారి తవ్వకాల నివేదికలు, కొన్ని పరిశోధన పత్రాలు తప్ప 1980 తర్వాత ఈ ఆలయంపై పరిశోధనలు దాదాపు శూన్యం అనే చెప్పాలి. ఈ అంశంపై మరింత పరిశోధన జరిగితే అత్యంత ప్రాచీన శైవ పూజా విధానానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ప్రధాన కేంద్రమనే విషయం నిర్ధారణ అవుతుందని కొందరి వాదన. ప్రపంచంలోని ఏడు వింతలకు ఏ విధంగా తగ్గకుండా ఈ శివలింగం, కాల ప్రభావాన్ని సవాలు చేస్తూ అనంత సంవత్సరాలుగా చెక్కు చెదరకుండా అలా నిలిచే ఉంది. పురావస్తు శాస్త్రజ్ఞుల అభిప్రాయం ప్రకారం గుడిమల్లంలోని శివాలయం క్రీ.పూ. ఒకటి అని, కొందరు 2, 3వ శతాబ్దాల నాటిదని భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేశారు. తవ్వకాలలో బయట పడ్డ శాసనాలు కొన్ని ఆలయపు లోపలి వెలుపలి గోడలపై ఉన్నాయి. వాటిలో కొన్ని పల్లవ, గంగ పల్లవ, బాణ, చోళుల కాలానికి చెందినవి. 802 కాలం



వాడైన పల్లవ రాజు నందివర్మ వేయించిన శాసనం ఉంది. ఈ ఆలయంలో శివలింగాన్ని ఎప్పుడు, ఎవరు? ప్రతిష్ఠించారు అనే విషయం తెలియరావడం లేదు. 1911లో గోపీనాథరావు అనే పురావస్తు శాస్త్రవేత్త సంవత్సరం పాటు పరిశోధించి ఈ ఆలయంలోని శాసనాలను పరిష్కరించి అద్భుతమైన ఈ లింగం ఉనికి తన పరిశోధనా పత్రంలో ప్రపంచానికి చాటారు. ప్రారంభంలో ఆరుబయట ప్రతిష్ఠించిన ఈ లింగంపై క్రీ.శ.9వ శతాబ్దం నుండి పలు రాజవంశాలవారు ఆయా కాలాలలో గుడి నిర్మించి పూజలు, పునస్కారాలు నిర్వహించారని శాసనాధారాలు తెలియజేస్తున్నాయి.

పురావస్తు శాస్త్రవేత్తలు ఈ లింగం చుట్టూ జరిపిన తవ్వకాలలో దొరికిన ఎముకల్ని బట్టి లింగానికి ప్రాచీన కాలంలో బలులు సైతం సమర్పించే వారనే అభిప్రాయానికి వచ్చారు. సువిశాల ఆలయ ప్రాంగణం చుట్టూ క్రీ.శ.8వ శతాబ్ది నుంచి వరుసగా బాణ, గోళ, పల్లవ, విజయనగర రాజులు ఇత్యాది వారు సూర్య, పార్వతీ ఇత్యాది అనేక ఆలయాలు, బావులు నిర్మించారని శాసనాధారం వల్ల తెలుస్తుంది. 1973లో భారతీయ పురావస్తుశాఖ జరిపిన తవ్వకాలలో క్రీ.పూ. కొన్ని మట్టి పాత్రలు, ఇటుకలు లభించాయి. అంతే తప్ప ఈ లింగం ప్రతిష్ఠించిన వారి గురించి కానీ, లింగం చరిత్రకు సంబంధించిన ఎటువంటి ఆధారాలు లభించలేదు. తలపాగా, ధోవతి ధరించిన ఈ రుద్రుని వస్త్రధారణ ఋగ్వేద కాలం నాటిదని శాస్త్రకారుల అంచనా. ప్రాచీన శైవ పూజా విధానం సవివరంగా తెలిపే ఈ లింగాన్ని చెక్కేందుకు వాడిన రాయి గురించి ఎలాంటి సమాచారం లేదు. ఆలయ గర్భగుడి సైతం గజ పుష్పాకారంలో గంభీరంగా ఉంటుంది. ఆలయంలో దొరికిన శాసనాల్లో దీన్ని పరమేశ్వరాలయంగా పేర్కొన్నారు. గుడిమల్ల గ్రామస్తుల్లో ఒకరైన వున్నం గుణశేఖర నాయుడు 2006 నుంచి 2008 వరకు డైరెక్టర్ జనరల్ ఆర్కియాలజీతో సమాచార చట్టం ఆయుధంగా యుద్ధం చేసి వారిని కేంద్ర సమాచార చట్టం ముందు నిలబెట్టారు.

ఈ గుడికి సంబంధించిన ఆస్తుల వివరాలు అటుంచితే కనీసం గుడికి సంబంధించిన సాహిత్యం కూడా వారి దగ్గర లేదనే నగ్నసత్యం అప్పట్లో బయట పడింది. ఈ క్రమంలో గుణశేఖర నాయుడు చేసిన కృషి ఫలితంగా 2009లో గుడిలో పూజలు జరిపేందుకు గ్రామస్తులకు అనుమతి సాధించారు.

ఆలయంలోని శివలింగాకారం చిత్రంగా ఉంటుంది. ఈ ఆకారం ప్రపంచంలో అరుదుగా కనిపిస్తుందని ఘంటాపథంగా చెప్పవచ్చు. ఈ శివలింగం పురుషాంగాన్ని పోలి దాదాపు 7 అడుగుల ఎత్తు, ఒక అడుగు వెడల్పు ఉండటం విశేషం. దానిపై రాక్షసుడి భుజాలపై నిలుచున్న శివమూర్తి ఉంటుంది. ఈ శివాలయంలోని శివుడు పరశురామేశ్వరుడుగా పూజలంద ుకుంటున్నాడు. ఇక్కడి శివలింగానికి ఎంతో విశిష్టత ఉంది. ఈ ఆలయంలోని గర్భాలయం అంతరాలయం, ముఖమండపాల కన్నా లోతుల ఉంటుంది. ఇక్కడ గర్భగృహంలో ప్రతిష్టించిన శివలింగం లింగ రూపంలో కాకుండా శివుడు మానవ రూపంలో మహావీరుడైన వేటగాని వలే కనిపిస్తాడు. లింగాన్ని ముదురు కాఫీ రంగులో ఉన్న రాతితో శిల్పీకరించారు. ఈ వర్ణాన్ని ముదురు గోధుమ వర్ణం అని కూడా చెప్పవచ్చు. లింగం ముందువైపు ఉబ్బెత్తుగానూ, లింగం ఉండి బయటకు పొడుచుకొని వచ్చినట్లుగా చెక్కిన శివుడు, అపస్మారక పురుషుని భుజాలపై నిలబడిన (స్థానకమూర్తి) రూపంలో అతి సుందరంగా ఉన్నాడు. స్వామి రెండు చేతులతో ఉన్నాడు. కుడి చేతితో ఒక గొర్రెపోతు (తలక్రిందుగా) యొక్క కాళ్ళు పట్టుకొనగా, ఎడమ చేతిలో చిన్నగిన్నె (చిప్ప)ను పట్టుకున్నాడు. ఎడమ భుజానికి ఒక గండ్రగొడ్డలి తగిలించుకొని ఉన్నాడు. స్వామి జటాభార (జటలన్నీ పైన ముడివేసినట్లు) తలకట్టుతో, చెవులకు అనేక రింగులు ఇంకా వివిధ ఆభరణాలు ధరించి, నడుము చుట్టూ చుట్టి, మధ్యలో కిందకు వేలాడుతున్నట్లు ఉన్న అర్థోరుకము (నడుము నుండి మోకాళ్ల వరకు ఉండే వస్త్రం) ధరించి ఉన్నాడు. లింగపు అగ్రభాగం, కింది పొడవైన స్థంభ భాగములను విడదీస్తున్నట్లుగా ఒక లోతైన పల్లం పడిన గీత స్పష్టంగా ఉండి, మొత్తం లింగం పురుషాంగాన్ని పోలి ఉండటం విశేషం.

ఆంధ్రశాతవాహనుల కాలం నాటి పురాతన శివాలయంగా భావిస్తున్న ఈ ఆలయానికి సంబంధించిన మరికొంత సమాచారం గుడిమల్లం ఆలయం



శాతవాహన నిర్మాణ శైలిని పోలి ఉంటుంది. తవ్వకాల్లో లభించిన శాసనాలు ద్వారా 12వ శతాబ్దంలో విక్రమ చోళులు కాలంలో ఆలయం పునర్నిర్మాణం జరిగినట్లు చరిత్ర చెబుతోంది. ఇందుకు సంబంధించిన విశేషాలు చంద్రగిరి కోటలోని మ్యూజియంలో లభ్యమవుతున్నాయి. ఈ లింగంపై ఒక చేత్తో పరుశువునూ, మరో చేత్తో గొర్రెను పట్టుకుని ఒక యక్షుడి భుజాలపై నిలబడిన రుద్రుడిని ధ్యాన ప్రతిమఖిగా చూపడం ఈ శిల్ప విశేషం. అలాగే తలపాగా ధోవతి ధరించిన ఈ రుద్రుడి వస్త్రధారణ ఋగ్వేదకాలం నాటిదని చరిత్రకారులు అంచనా వేశారు. ప్రాచీనశైవ జీవన విధానాన్ని సవివరంగా తెలిపే ఈ అద్భుతాన్ని చెక్కేందుకు వాడిన రాయి గురించి ఎటువంటి సమాచారం లేదు. ఆలయంలో దొరికిన శాసనాల్లో దీన్ని పరమేశ్వర ఆలయంగాను, దీని యజమాని, అధికారి రుద్రుడిగా పేర్కొన్నారు. శివుని అనేక రూపాలను ఏకలింగంపై నాటి శిల్పకారులు నైపుణ్యతతో మలచడం విశేషం. ఈ లింగం కింద 350 అడుగుల లోతులోని వాటర్ టేబుల్లో నీటి ఒత్తిడి పెరిగితే ఆ నీరు లింగాన్ని అభిషేకించేలా ఇంజనీరింగ్ పనితనంతో, ఎంతో నైపుణ్యంతో నిర్మాణ చాతుర్యాన్ని చూపారు.

ఈ లింగం తాళం ఆకారంలో ప్రతిష్ఠించినందువల్ల దీన్ని ఏ మాత్రం కదిలించినా గజపృష్ఠ (ఏనుగు వెనుకవైపు) ఆకారంలో ఉండే గుడి మొత్తం కూలిపోతుందని కొందరి వాదన. ఆనందకుమార్ స్వామి, జితేంద్రనాథ్ బెనర్జీ ఇత్యాది అనేకమంది పురాతత్త్వవేత్తలు, చరిత్రకారులు, శాస్త్రవేత్తలు శిల్ప చరిత్రలో అపురూపమైన ఈ శివలింగాన్ని తమ రచనల్లో అభిమానించి, ఆరాధించి, ప్రేమించారు.

పురావస్తు శాస్త్రవేత్తలు తమకు అందుబాటులోని పరిజ్ఞానంతో ఈ శివలింగం 1 లేదా 2వ శతాబ్దాన కాలానికి చెందిందని తేల్చి చెప్పారు. అలనాటి సాంచి, అమరావతి శిల్పాల వలె ఈ శివలింగాన్ని వృక్ష, చైత్య ఆరాధన ప్రకారం బహిరంగ ప్రదేశంలోనే పూజలు చేసినట్లు తెలుస్తుంది. తదనంతర కాలంలో జరిగిన నిర్మాణాలలో భాగంగా వాస్తుశైలి అమరావతి, మధుర వాస్తుశైలిని పోలి ఉందని తేల్చి చెప్పారు.

## గుడిమల్లం శివలింగాన్ని పోలిన లింగాలు

ఉత్తరప్రదేశ్‌లోని మధురలో ఉన్న మ్యూజియంలో క్రీ.పూ. ఒకటవ శతాబ్దానికి చెందిన శివలింగం ఉంది. అది ఈ గుడిమల్లం శివలింగాన్ని పోలి ఉంది. అలాగే ఉజ్జయినిలో జరిపిన పురావస్తు తవ్వకాలలో క్రీ.పూ. 2, 3వ శతాబ్దానికి చెందినవిగా భావించే కొన్ని రాగి నాణేలు దొరికాయి. వాటిపై ఉన్న చిత్రం అచ్చం గుడిమల్లం శివలింగమే. నెల్లూరు చెరువులో కూడా ఇటువంటి లింగం ఆరుబయటే ఉందని కొందరు చెబుతున్నారు.

మధురై మ్యూజియంలో ఇటువంటి లింగాన్ని పోలిన ఆకృతి ఉంది. శ్రీకాళహస్తికి దగ్గరలో ఉండే ఈ ఆలయం భారతదేశంలో శివారాధన ప్రాచీనత తెలిపే ఒక అపురూప సాక్ష్యం. ప్రముఖ పురాతత్త్వవేత్త ఇంగువ కార్తికేయశర్మ తన రచనల్లో అనేక ఆధారాలతో సహా మొత్తం భారతదేశంలోనే ఇది ప్రాచీన రుద్రలింగంగా తగిన ఆధారాలతో నిరూపించారు. ఏకశిలపై శివుని అనేక రూపాలు చెక్కడం నాటి శిల్పుల విశిష్టతను చాటుతోంది.

భూగర్భజల మట్టం ఈ లింగం కింద 350 అడుగుల లోతు లో ఉన్నప్పటికీ ఒత్తిడి పెరిగిన సమయంలో ఆ నీళ్లు లింగంపై పడుతుంటాయి. ఈ నిర్మాణం వెనుక అద్భుతమైన ఆర్కిటెక్చర్ పరిజ్ఞానం దాగి ఉంది. 2005 డిసెంబర్ 5న అలా నీళ్లు శివుడిని అభిషేకించాయి. తిరిగి 60 ఏళ్లకు అంటే 2065 కు అలా వచ్చే వరదనీటితో ఈ ఆలయం నిండి పోతుందని భక్తుల నమ్మకం. శిల్ప చరిత్రలోనే అపురూపమైనదని అంతర్జాతీయ పురాతత్త్వవేత్తల రచనలు కూడా స్పష్టం చేస్తున్నాయి. స్థానికుల సహకారంతో దేవాదాయశాఖవారు 7 రోజులపాటు మహాశివరాత్రి ఉత్సవాలను ఇక్కడ నిర్వహిస్తారు. గుడిమల్లంలోని శ్రీ పరశురామేశ్వరుని ఆలయం శైవం, వైష్ణం రెండింటినీ ప్రతిబింబిస్తున్న ఆలయం.

# మే - 11, 2025 నుండి మే - 17, 2025 వరకు




## వారఫలం

**శ్రీమతి ములుగు శివజ్యోతి, ప్రముఖ జ్యోతిష్యురాలు**

నారాయణ నాయక్ కాంప్లెక్స్, 2వ అంతస్తు,
గాంధీ జ్ఞానమందిర్ వెనుక, కోఠి, హైదరాబాద్-1
ఫోన్ : 98494 53449, 9440927795


### మేషం

ఈ వారం కాంట్రాక్టులు, సబ్ కాంట్రాక్టులు, లైసెన్సులు, లీజులు లాభిస్తాయి. దైవానుగ్రహం వెన్నంటి రక్షిస్తున్నట్లుగా భావిస్తారు. సంతానం పురోగతి బాగుంటుంది. విదేశాలకు వెళ్ళ డానికి అవకాశాలు వస్తాయి. తెల్ల జిల్లేడు వత్తులతో అష్టమూలికా తైలంతో దీపారాధన చేయడం వలన విఘ్నేశ్వరుని అనుగ్రహం లభిస్తుంది. ముఖ్యమైన వ్యవహారాలు అనుకూలంగానే ఉంటాయి.

### వృషభం

ఈ వారం కాంట్రాక్టు పద్ధతిన ఉద్యోగాలు చేస్తున్న వారికి ఉద్యోగం పర్మినెంటు అవుతుంది. ఆరోగ్యం విషయంలో జాగ్రత్తలు అవసరం. దుష్ప్రచారాలను పట్టించుకోకుండా మీ పని మీరు చేసుకుపోవటం వల్ల సానుకూల ఫలితాలు సాధిస్తారు. అష్టగణపతి పీఠానికి సుమంగళి పసుపు, ఆరావళి కుంకుమతో బొట్టుపెట్టి పూజ చేయటం అన్ని విధాల మంచిది. పోటీపరీక్షల్లో విజయం సాధిస్తారు.

### మిథునం

ఈ వారం సహోదర వర్గం వల్ల మేలు జరుగుతుంది. రాజకీయపరమైన నిర్ణయాలు లాభిస్తాయి. బంధువులకు, మిత్రులకు చివరకు మీరు శత్రువులకు కూడా సహాయ సహకారాలు అందజేస్తారు. అందరినీ ఒకే తాటిపై నడిపించి విజయవంతమైన ఫలితాలను సాధిస్తారు. నిత్యం మేధా దక్షిణామూర్తి రూపు ధరించండి.

### కర్కాటకం

ఈ వారం ఆర్థికాభివృద్ధి కొరకు లక్ష్మీకటాక్షాన్ని ఉప యోగించండి. ఇది చాలా మంచిది. ఎముకలకు సంబంధించిన అనారోగ్యం రావచ్చును, జాగ్రత్త వహించండి. పిల్లల విద్యా విషయమై ప్రత్యేక శ్రద్ధ వహిస్తారు, కొంత మందికి వాలెంటరీ రిటైర్మెంట్ తీసుకోవాలనే ఆలోచనలు వస్తాయి.సహోద్యోగులు మీ మీద చేస్తున్న దుష్ప్రచారం అబద్ధాలేనని నిరూపిస్తారు

### సింహం

ఈ వారం ముఖ్యమైన సభలు, సమావేశాలకు ఆహ్వానాలు అందటం మీకు ఆశ్చర్యం కలిగిస్తుంది. ఆర్థికంగా ఎంత ఆదాయం వచ్చినా దాచుకునేది ఏమీ ఉండదు, ఇది చాలా మంచిది. సాంకేతిక విద్య, వైద్య విద్యకు సంబంధించిన విషయాలు, విదేశీయాన సంబంధించిన విషయాలు కూడా అతికష్టం మీద సానుకూల పడతాయి. విద్యార్థిని, విద్యార్థులు నిత్యం సరస్వతీ తిలకాన్ని నుదుటన ధరించడంవలన మంచి ఫలితాలను పొందుతారు.

### కన్య

ఈ వారం వివాదాలు, తగాదాలు, మధ్యవర్తి పంచనామాలు, రాజీయత్నాలు, పరిష్కారాలు మొదలైనవి తప్పకపోవచ్చు. మీ ప్రమేయం లేని విషయాల్లో కూడా మీ పేరువినబడుతుంది. వ్యాపార సంబంధమైన విషయాలు బాగున్నాయి. వ్యాపారంలో నూతన మార్పులు, చేర్పులు కలసి వస్తాయి. నానారకాల అరిష్టాలు, శత్రుబాధలు, బాధలు నశించటానికి త్రిశూల్ ఉపయోగించండి.

### తుల

ఈ వారం ప్రతిష్టాత్మకమైన యూనివర్సిటీలలో సీటు లభించడం కష్టం అవుతుంది. తెల్లజిల్లేడు వత్తులతో అష్టమూలికాతైలంతో దీపారాధన చేయటం వలన విఘ్నేశ్వరుని అనుగ్రహం లభిస్తుంది. దైవానుగ్రహం వెన్నంటి రక్షిస్తున్నట్లుగా భావిస్తారు. ఆర్థిక పురోగతి బాగుంది. వృత్తి, ఉద్యోగాల పరంగా సంతృప్తి కలుగుతుంది. ప్రేమ, మమకారం ఎవరి మీద అయితే పెంచుకున్నారో వాళ్ళు మంచి అభివృద్ధిలోకి వస్తారు.

### వృశ్చికం

ఈ వారం నవగ్రహ నిర్మాణం అనే కల నెరవేరుతుంది. ఆరోగ్యం మెరుగుపడుతుంది. ఏ దేవుడికైనా, దేవతకైనా, పూజ చేసేటప్పుడు మహాతీర్థం పొడిని కొద్దిగా ఉపయోగించాలి. ఇష్టదేవతానుగ్రహం కలుగుతుంది. వ్యాపార సంబంధమైన విషయాలు ఇబ్బంది లేకుండా నడుస్తాయి. ఆర్థిక పరిస్థితి కుదుటపడుతుంది. దీర్ఘకాలిక సమస్యలు తీరుతాయి.

### ధనస్సు

ఈ వారం నూతన వాహనాన్ని కొనుగోలు చేస్తారు. విందులు, వినోదాలకి సాధ్యమైనంత దూరంగా ఉంటారు, అయినప్పటికీ కొన్ని విందులు వినోదాలకు వెళ్ళవలసి వస్తుంది. శని మహర్దశ, శని అంతర్దశ నడుస్తున్న వాళ్ళు హనుమాన్ సింధూర్ ఉపయోగించడం వలన మనోధైర్యం, ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. అనుకోని అవకాశాలు లాభిస్తాయి. నూతన వృత్తి, వ్యాపార ఉద్యోగాల దూరదృష్టి పెడతారు.

### మకరం

ఈ వారం మీ జీవితాశయం నెరవేర్చుకోవడానికి రాత్రింబవళ్ళు శ్రమిస్తారు. నిత్యం సిద్ధగంధంతో శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని పూజించడం చెప్పదగినది. ఒక విలువైన ఆస్తిని కొనుగోలు చేయగలుగుతారు. లక్ష్మీ తామరవత్తులు అష్టమూలికా తైలంతో కలిపి దీపారాధన చేయటం వలన లక్ష్మీకటాక్షం కలుగుతుంది. రాజకీయ సంబంధమైన వ్యవహారాలలో సంతృప్తిపడి మీ సామాజిక వర్గాన్ని నష్టానికి దారితీసే పరిస్థితి కలిపిస్తారు.


### కుంభం


ఈ వారం వ్యాపారాలలో నూతన మార్పిడీలు చేయటం కానీ లేక ఒక రంగు నుండి మరొక రంగం లోకి మారడం సంభవించవచ్చును. అష్టగణ పీఠానికి, సిద్ధగంధం, ఆరావళి కుంకుమతో, పరిమళ గంధంతో పూజ చేయటం వలన వాస్తుదోషాలు నశిస్తాయి. నమ్మక ద్రోహులను ఆదరించకుండా దూరంగా ఉంచండి, గతంలో చేసిన పొరపాట్లే మళ్ళీ చేయవద్దు. రాజకీయరంగ ప్రవేశం చేస్తారు,


### మీనం

ఈ వారం వృత్తి ఉద్యోగాలపరంగా శారీరక, మానసిక వత్తిడి అధికంగా ఉంటుంది. కోర్టుతీర్పులు మీకు అనుకూలంగా ఉంటాయి. కాంట్రాక్టు పద్ధతిన ఉద్యోగాలు చేస్తున్న వారికి ఉద్యోగం పర్మినెంట్ అవుతుంది. స్వర్ణాకర్షణ భైరవ యంత్రాం నాకు నిత్యం పూజ చేయటం వలన ఐశ్వర్యసిద్ధి, దారిద్ర్య నిర్మూలన, వ్యాపార వృద్ధికి ఉపకరించును. దైవానుగ్రహం వెన్నంటి రక్షిస్తున్నట్లుగా భావిస్తారు.

# ఈ వారం 'కార్టూన్స్'


ఏంటయ్యా ఇది.. "ఆ పొదల్లో ఉన్న ఆమెను లతను
చాలా సార్లు.... 'ఆపొద' కాదు.. 'ఆపద'!!
- ఎడిటర్ -
Zakir


ఎవడికో భయపడి 'కశ్మీర్' వెళ్లకుండా
ఉండడమా..? నో.. కశ్మీర్ కే వెళ్దాం పదండి!!
TOUR
Zakir...


నన్ను ఆశీర్వదించి పంపించమ్మా
'సేఫ్ ఇండియా' ను మదర్స్ డే గిఫ్ట్ గా ఇస్తాను...!
Zakir..





అతి పొడవైన ఫౌంటెన్ వంతెనగా పేరు గాంచిన ఈ వంతెన దక్షిణ కొరియాలో ఉంది. దీనిని మూన్‌లైట్ రెయిన్‌బో ఫౌంటెన్ బ్రిడ్జ్ అని కూడా పిలుస్తారు.



